PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu


సంపుటి : 43 సంచిక : 6 | విజయవాడ, ఆదివారం 6 ఆగస్టు 2023 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 6 August 2023 | Rs

ఫార్మసీ కోర్సులకు ఫీజుల ఖరారు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రైవేటు కళాశాలల్లో బి-ఫార్మసీ, ఎం-ఫార్మసీ, ఫార్మ్-డి, ఫార్మ్-సిబి కోర్సులకు రాష్ట్ర ప్రభుత్వం ఫీజులను ఖరారు చేసింది. ఇందుకు సంబంధించిన జిఓను విడుదల చేసింది. 2023-24 నుంచి 2025-26 వరకు ఈ ఫీజులు అమల్లో ఉంటాయి. బి-ఫార్మాసీ 177 కళాశాలల్లో కనీస ఫీజు రూ.38 వేలు, గరిష్టంగా రూ.80 వేలను ప్రభుత్వం నిర్ధారించింది. 102 ఎం-ఫార్మ కళాశాలల్లో కనీస ఫీజు రూ.60 వేలుగా, గరిష్టంగా రూ.90 వేలుగా నిర్ణయించింది. ఫార్మ్-డి 62 కళాశాలల్లో కనిష్టంగా రూ.38 వేలు, గరిష్టంగా రూ.65 వేలు, ఫార్మ్-పిబి కళాశాలల్లో కనిష్ట ఫీజు రూ.42 వేలు, గరిష్టంగా రూ.80 వేలుగా నిర్ధారించింది.





చరిత్ర సృష్టించిన అదితి

6

- ఆర్చరీ వ్యక్తిగత కాంపౌండ్ విభాగంలో పసిడి

మామ కక్ష్యలోకి చంద్రయాన్-3

బెంగళూరు : చంద్రునిపై పరిశోధనల కోసం ఇస్రో పంపిన చంద్రయాన్-3ను శనివారం రాత్రి 7గంటల సమయంలో చంద్రుని కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. ఇక్కడి మిషన్ ఆపరేషన్స్ కాంప్లెక్స్ (ఎంఓఎక్స్) నుండి ఈ మేరకు ఆదేశాలను పంపినట్లు ఇస్రో తెలిపింది. ఈ మేరకు ఎక్స్ (పూర్వపు ట్విట్టర్)లో పోస్టు చేసింది. ఇక తదుపరి ఆపరేషన్ కక్ష్యను కుదించడం. ఈ ప్రక్రియను ఆదివారం రాత్రి 11గంటల సమయంలో చేపట్టనున్నారు. జులై 14న ఇస్రో చంద్రయాన్-3ని ప్రయోగించింది. మూడింట రెండొంతుల దూరాన్ని చంద్రయాన్ పూర్తి చేసిందని శుక్రవారం ఇస్రో ప్రకటించింది. గత మూడు వారాల్లో ఐదు ఆపరేషన్లు చేపట్టి భూమికి దూరంగా చంద్రయాన్-3 అంతరిక్ష నౌకను పయనించేలా చేశారు. ఆ తర్వాత ఆగస్టు 1వ తేదిన కీలకమైన సింగిల్ షాట్ మూవ్‌ను అమలు చేసి భూ కక్ష్య నుండి చంద్రుని దిశగా కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. ఇక ఆ తర్వాత భూ కక్ష్యకు దూరంగా జరిగిన అంతరిక్ష నౌక చంద్రుని కక్ష్యకు సమీపంగా పయనించడం ఆరంభించింది. శనివారం మరో కీలకమైన ప్రక్రియలో చంద్రుని కక్ష్యలోకి రోదసీ నౌకను ప్రవేశపెట్టారు. ప్రస్తుతం రోదసీ నౌక పరిస్థితి సాధారణంగానే వుందని, ఆగస్టు 23న చంద్రుని ఉపరితలంపై సజావుగా దిగేందుకు ప్రయత్నిస్తామని ఇస్రో గతంలో తెలిపింది. ఒక వారం రోజుల తర్వాత ల్యాండింగ్ కూడా సాఫీగా జరుగుతుందని, ఆందోళన చెందే పనే లేదని కేంద్ర సైన్స్, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

370వ అధికరణ రద్దుకు నాలుగేళ్లు!

- నేతల అరెస్టు, ఆంక్షల విధింపు, కార్యాలయాలకు సీళ్లు
- ఇదీ పాలనా యంత్రాంగం తీరు అంటూ పిడిపి, ఎన్‌సిల విమర్శ

శ్రీనగర్, న్యూఢిల్లీ : జమ్ము కాశ్మీర్ ప్రత్యేక రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370, ఆర్టికల్ 35 ఎలను రద్దు చేస్తూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకున్న రాజ్యాంగ విరుద్ధ చర్యకు శనివారంతో నాలుగేళ్లు పూర్తయ్యాయి. దీంతోపాటు ఆ ఆ రాష్ట్ర చారిత్రిక నేపథ్యాన్ని చెరిపేస్తూ , ఆ రాష్ట్రాన్ని జమ్మూ కాశ్మీర్, లడఖ్‌ల పేరుతో రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించింది. ఇందుకు సంబంధించిన చట్టాన్ని అదే రోజు (2019 ఆగస్ట్ 5న) తీసుకొచ్చింది. ఏకపక్షంగా, నిరంకుశంగా తీసుకున్న ఈ చర్య వల్ల జమ్మూ కాశ్మీర్‌లో రాజకీయ శూన్యత, తీవ్ర అనిశ్చితి నెలకొంది. ఈ చీకటి చర్యకు నాలుగేళు అయిన సందర్భంగా నిరసనలు తెలిపేందుకు అవకాశమివ్వకుండా మాజీ ముఖ్యమంత్రులు ఫరూక్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ, సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే యూసఫ్ తరిగావి సహా పలువురు నేతలను ముందస్తు గృహ నిర్బంధం గావించింది. ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకిస్తూ దాఖలైన పలు పిటిషన్లు సుప్రీంకోర్టులో ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. నాయకుల అరెస్టు, ఆంక్షలు విధించడం, కార్యాలయాలకు సీళ్లు వేయడం, రాళ్లు రువ్విన ఘటనల కేసులో నిందితులకు పాస్‌పోర్టు, ఇతర ప్రభుత్వ సేవలను తిరస్కరించడం వంటి చర్యలకు లెఫ్టినెంట్ గవర్నర్ పాలనా యంత్రాంగం పాల్పడటంపై జమ్ము కాశ్మీర్ ప్రాంతీయ పార్టీలైన నేషనల్ కాన్ఫరెన్స్, పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇది సహజ న్యాయాన్ని తుంగలో తొక్కడమేనని వ్యాఖ్యానించాయి. నేరం రుజువయ్యేవరకు అందరూ నిర్దోషులే అని న్యాయశాస్త్రం చెబుతున్నదానికి భిన్నంగా లెఫ్టినెంట్ గవర్నరు వ్యవహరిస్తున్నారని విమర్శించాయి. పూర్వ రాష్ట్రంలోని శాశ్వత నివాసుల స్థితిని మార్చడం ద్వారా ఉద్యోగాల రక్షణ, భూ హక్కులను ప్రభుత్వం ఏకపక్షగా లాగేసుకుంది. ఇది ప్రాంతాలు, వర్గాల ప్రజల మధ్య

మిగతా 5లో

జమ్ముకాశ్మీర్‌లో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలి

- తక్షణమే అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలి
- సిపిఎం కేంద్ర కమిటీ డిమాండ్

6

టిటిడి ఛైర్మన్‌గా భూమన కరుణాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో




తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఛైర్మన్‌గా తిరుపతి వైసిపి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి రెండో సారి బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం టిటిడి ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న వైవి సుబ్బారెడ్డి పదవీకాలం ఈ నెల 8తో ముగియనుండటంతో ఆయన స్థానంలో భూమనను నియమించారు. ఈ మేరకు భూమన పేరును ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఖరారు చేశారు. గతంలో 2006-08 వరకు టిటిడి ఛైర్మన్‌గా భూమన పనిచేశారు. 2012, 2019లో తిరుపతి నుంచి వైసిపి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2023 జులై నుంచి సభా హక్కుల కమిటీ ఛైర్మన్‌గానూ ఉంటున్నారు. భూమన స్వస్థలం వైఎస్ఆర్ కడప జిల్లా నందలూరు మండలం, ఈదరపల్లి. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో మాస్టర్ డిగ్రీ చేశారు. వైవి సుబ్బారెడ్డి లేదా ఆయన కుమారుడు ఒంగోలు ఎంపి అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారని, ఆయన స్థానంలో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తికి టిటిడి ఛైర్మన్ పదవి ఇవ్వనున్నట్లు ఇప్పటివరకు ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే.

చితికిపోతున్న చిన్న మొత్తాలు

- ధరాఘాతంతో తగ్గిన నికర వసూళ్లు
- డిపాజిట్లు తక్కువ.. ఉపసంహరణలే ఎక్కువ
- 11 ఏళ్లలో తొలిసారి పతనం





న్యూఢిల్లీ : దేశంలో ఆకాశమే హద్దుగా పెరిగిపోతున్న నిత్యావసరాల ధరలు ప్రజల పొదుపు శక్తిని కుంగదీస్తున్నాయి. కాయకష్టం చేసి కాస్తోకూస్తో పొదుపు చేసుకునే సామాన్యులకు ధరాఘాతంతో పొదుపు ఊసే లేకుండాపోతుంది. చిన్న మొత్తాల పొదుపు పథకాల్లో నికర వసూళ్లు తగ్గడమే ఇందుకు నిదర్శనం. పేద, మధ్య తరగతి వారు అత్యధికంగా పొదుపు చేసే పథకాల్లో దశాబ్దం కాలంలో ఎప్పుడూ లేని విధంగా డిపాజిట్లు పడిపోయాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం (2022-23)లో నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్ (ఎన్ఎస్‌సి), పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పిపిఎఫ్) వంటి చిన్న పొదుపు పథకాల నికర వసూళ్లు రూ.3.04 లక్షల కోట్లకు పడిపోయాయి. డిపాజిట్ల కంటే ఉపసంహరణలే ఎక్కువగా ఉండటం గమనార్హం. గత 11 ఏళ్లలో నికర వసూళ్లలో తగ్గుదల చోటు చేసుకోవడం తొలిసారి. 2021-22లో రూ.3.33 లక్షల కోట్ల డిపాజిట్లు నమోదయ్యాయి.

2022-23లో చిన్న మొత్తాల నికర వసూళ్లలో అత్యధిక తగ్గుదల నమోదైన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో (యుటిలు) పశ్చిమ బెంగాల్, గుజరాత్, మహారాష్ట్ర, ఢిల్లీ, పంజాబ్ మొదటి 5 స్థానాల్లో నిలిచాయి. కాగా బీహార్, పుదుచ్చేరి, ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్, అస్సాం రాష్ట్రాల్లో నికర వసూళ్లలో పెరుగుదల నమోదైంది. వీటితో పాటు దాద్రా, నగర్ హవేలీ మినహా అన్ని ఇతర రాష్ట్రాలు, యుటిలలో నికర వసూళ్లు భారీగా పడిపోయాయి.

1999 నుంచి చిన్న పొదుపు పథకాల క్రింద వచ్చిన అన్ని డిపాజిట్లను నేషనల్ స్మాల్ సేవింగ్స్ ఫండ్స్ (ఎన్ఎస్ఎస్ఎఫ్)లో జమ చేస్తున్నారు. కరోనాకు ముందూ, తర్వాత కూడా కేంద్రం చాలా కాలం పాటు చిన్న మొత్తాలపై వడ్డీ రేట్లను పెంచకుండా యథాతథంగా కొనసాగించడం, కొన్ని సందర్భాల్లో తగ్గించడం వంటి చర్యలకు పాల్పడింది. దీని ప్రభావం చిన్న మొత్తాలపై తీవ్రంగా పడిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. చిన్న మొత్తాల పొదుపుపై మోడీ సర్కార్ కక్షపూనిందంటూ విమర్శలు వెల్లువెత్తడంతో 2022-23 మార్చి త్రైమాసికంలో ఆర్థిక మంత్రిత్వ శాఖ వడ్డీ రేట్లను స్వల్పంగా పెంచింది. ఏడాది, రెండేళ్లు, మూడేళ్ల కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై వరుసగా 6.6 శాతం, 6.8 శాతం, 6.9 శాతం చొప్పున వడ్డీని అందించింది. కానీ పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను పదేపదే పెంచేస్తూపోవడం, నిత్యావసరాల ధరలు తగ్గించేందుకు ఎటువంటి చర్యలేవీ చేపట్టకపోవడం వల్ల ప్రజల ఆర్థిక పరిస్థితులు కుచించుకుపోయాయి. కోవిడ్ నేపథ్యంలో కోట్లాది మంది ప్రజలు జీవనోపాధులు దెబ్బతినడం, గ్రామీణ భారతావనిలో కాస్తయినా బతుకు భరోసా కల్పిస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి తగిన నిధులు కేటాయించకుండా దానిని నిర్వీర్యం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అనేక ఆంక్షలు, డిజిటల్ ఇబ్బందులు సృష్టించడంతో ఈ ఏడాది 5 కోట్ల మంది పైగా కార్మికుల పేర్లను ఉపాధి కార్డుల నుంచి కేంద్రం తొలగించింది. కేంద్ర ప్రభుత్వ వినాశకర చర్యల వల్లే ప్రజల కొనుగోలు శక్తి పడిపోయి..ఆర్థిక కష్టాలతో సతమతమవుతున్నారని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలపై భారాలు తగ్గింపు చర్యలు చేపట్టకపోతే సంక్షోభం మరింత తీవ్రతరమవుతుందని హెచ్చరిస్తున్నారు.

'ఉపా'ను రద్దు చేయండి

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన సేచ్ఛను హరిస్తున్న 'ఉపా' (అన్‌లా ఫుల్ యాక్టివిటీస్ ప్రివెన్షన్ యాక్ట్)ను రద్దు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఉపా రద్దు పోరాట కమిటీ ఆధ్వర్యంలో శనివారం విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఛత్తీస్‌గఢ్‌లోని నాగర్ నార్ కేసులో అక్రమంగా అరెస్టు చేసిన కుల నిర్మూలన పోరాట సమితి అధ్యక్షులు దుడ్డు ప్రభాకర్, ఆర్‌కె భార్య శిరీష, దేవేంద్ర, దేవేందర్, పద్మను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పౌరహక్కుల నాయకులు ప్రొఫెసర్ హరిగోపాల్ మాట్లాడుతూ..జాతీయ భద్రత పేరుతో తీసుకొచ్చిన ఉపా చట్టం ప్రశ్నించే గొంతులపై దాడి చేస్తుందని విమర్శించారు. ఉపా చట్టానికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఒపిడిఆర్ కార్యదర్శి హనుమంతరావు మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని పూర్తిగా కేంద్ర ప్రభుత్వం తమ గుప్పెట్లో పెట్టుకుందన్నారు. ఉపా పోరాట రద్దు కమిటీ కన్వీనరు చిలుకా చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో రాబోయే రోజుల్లో ఉపా రద్దు కోసం జిల్లా కలెక్టరేట్ల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో విరసం అధ్యక్షులు అరసవల్లి కృష్ణ, నాయకులు కళ్యాణరావు, పౌరహక్కుల సంఘం బాధ్యులు శ్రీమన్నారాయణ, దుడ్డు ప్రభాకర్ భార్య సుగుణ కుమారి, ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి, పిడిఎస్‌యు నాయకులు రవిచంద్ర పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.



రాజును ఈడ్చుకుంటున్న తీసుకెళ్తున్న పోలీసులు

టెక్కలి డిఎస్‌పి అత్యుత్సాహం

- మణిపూర్ ఘటనలపై నిరసన ర్యాలీ అడ్డగింత
- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాజుపై దాడి

ప్రజాశక్తి - టెక్కలి రూరల్ (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లా టెక్కలి డిఎస్‌పి బాలచంద్రారెడ్డి అత్యుత్సాహం ప్రదర్శించారు. మణిపూర్‌లో మారణకాండను ఆపాలని, ప్రజలు, మహిళలకు రక్షణ కల్పించాలని, శాంతిని నెలకొల్పాలని టెక్కలిలోని అంబేద్కర్ జంక్షన్ నుంచి ఇందిరాగాంధీ కూడలి వరకు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన విద్యార్థులు చేపట్టిన ర్యాలీని పోలీసులు శనివారం అడ్డుకున్నారు. తాము శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తున్నామని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్.రాజు అనడంతో డిఎస్‌పి బాలచంద్రారెడ్డి ఆగ్రహంతో ఊగిపోయారు. రాజును బలవంతంగా పోలీస్‌స్టేషన్‌కు ఈడ్చుకెళ్లి అక్కడ కొట్టారు. అనంతరం ఆయనను విడుదల చేశారు. మరోవైపు కళాశాలల యాజమాన్య ప్రతినిధులను స్టేషన్‌కు పిలిపించారు. ర్యాలీకి విద్యార్థులను ఎందుకు పంపించారంటూ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజుపై దాడి ఘటనను ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి హరీష్, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు వేర్వేరు ప్రకటనల్లో తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిఒక్కరూ సభలు, సమావేశాలు నిర్వహించుకునే హక్కు ఉందని పేర్కొన్నారు. దాడి ఘటనను ప్రజలు, ప్రజాతంత్రవాదులు ఖండించాలని కోరారు.

టెక్కలి డిఎస్‌పిపై చర్యలు తీసుకోవాలి

ఎస్‌ఎఫ్‌ఐ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు సిహెచ్ రాజుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన టెక్కలి డిఎస్‌పి బాలచందర్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ప్రసన్నకుమార్, అశోక్ డిమాండ్ చేశారు. ఈ దాడిపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు.

పాలిటెక్నిక్ అడ్మిషన్లు ప్రారంభించాలి ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాలిటెక్నిక్ ప్రవేశాల ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదోతరగతి ఫలితాలు వెలువడిన ఐదు రోజులకే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించారని, 75 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం, అధికారులు తాత్సర్యం చేస్తున్నారని పేర్కొన్నారు. పాలిసెట్‌లో 1.20 లక్షల మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. వీరిలో కొంతమంది ఇతర రాష్ట్రాలకు, ఇతర కోర్సుల్లో చేరుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం అడ్మిషన్ల ప్రక్రియ పూర్తిచేయాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

మంత్రివర్గం నుంచి పెద్దిరెడ్డిని తొలగించాలి

- టిడిపి నేతల డిమాండ్
- అంగళ్లు ఘటనపై గవర్నరుకు ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మంత్రి వర్గం నుంచి తొలగించాలని, చిత్తూరు ఎస్‌పి రిషాంత్ రెడ్డిని సస్పెండ్ చేయాలని టిడిపి నేతలు డిమాండ్ చేశారు. అన్నమయ్య జిల్లా అంగళ్లు ఘటనపై రాజ్‌భవన్‌లో గవర్నరు అబ్దుల్ నజీర్‌ను శనివారం కలిసి ఫిర్యాదు చేశారు. సంఘటన వీడియోలను ఆయనకు అందజేసి అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రం గుండా రాజ్యంగా మారిందని ఆ పార్టీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు విమర్శించారు. చంద్రబాబు పర్యటిస్తుంటే దారిలో వైసిపి నేతలను పోలీసులు ఎలా అనుమతించారని ప్రశ్నించారు. డిజిపి తమను కలవడానికి ఇష్టపడటం లేదని పేర్కొన్నారు. ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మాట్లాడుతూ.. పుంగనూరు అరాచకానికి మంత్రి పెద్దిరెడ్డి కుట్ర పన్నారని, ఆయన్ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌పి రిషాంత్ రెడ్డి వైసిపి కార్యకర్తలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గవర్నరును కలిసిన వారిలో ఆ పార్టీ ఎమ్మెల్సీ పి అశోక్‌బాబు, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు ఉన్నారు. ఈ సంఘటనపై వర్ల రామయ్య జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని జగన్ పాతరేశారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు విమర్శించారు. పల్నాడు జిల్లా బోదలవీడులో టిడిపి సానుభూతి పరుడు కోటయ్య కుటుంబంపై వైసిపి నేతలు దాడి చేశారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

చిత్తూరు బంద్ ప్రశాంతం

- నిలిచిపోయిన వాహనాలు
- మూతపడిన వాణిజ్య సముదాయాలు
- అమర్ రాజా బస్సు అద్దాలను పగలగొట్టిన వైసిపి నేతలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్



చిత్తూరులో నల్లకండువాలతో నిరసన తెలుపుతున్న వైసిపి కార్యకర్తలు

చిత్తూరు జిల్లాలో వైసిపి నాయకులు చేపట్టిన బంద్ శనివారం ప్రశాంతంగా ముగిసింది. పుంగనూరులో హింసకు కారణం తెలుగుదేశం పార్టీయేనని ఆరోపిస్తూ ఉదయం ఆరు గంటలకే వైసిపి శ్రేణులు భారీగా చిత్తూరులోని గాంధీ విగ్రహం వద్దకు చేరుకొని నల్లకండువాలతో నిరసన తెలిపాయి. బంద్ సందర్భంగా బస్సులు, భారీ వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. వాణిజ్య దుకాణాలు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. వైసిపి నాయకులు, కార్యకర్తలు ద్విచక్రవాహనాల్లో నగరంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అమర్ రాజా బ్యాటరీస్‌కు చెందిన బస్సును అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు కొంగారెడ్డి పల్ల వద్ద అడ్డుకొని అందులోని సిబ్బందిని కిందకు దింపేశారు. బస్సు అద్దాలు పగుల గొట్టారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డిఐజి అమ్మిరెడ్డి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పోలీసులను పరామర్శించారు. నగరంలో పలుచోట్ల చంద్రబాబు దిష్టిబొమ్మలను తగులబెట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా చిత్తూరు డిఎస్‌పి శ్రీనివాసమూర్తి నేతృత్వంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. బంద్ నేపథ్యంలో పుంగనూరులో ఆర్‌టిసి బస్సులను డిపోలోనే నిలిచిపోయాయి. కుప్పంలో వైసిపి నాయకులు నిరసన వ్యక్తం చేస్తూ ఆర్‌టిసి బస్సులు, ప్రయివేట్ ఆటోలను ధ్వంసం చేశారు. పలమనేరులో ఎమ్మెల్యే వెంకటగౌడ బంద్‌లో పాల్గొన్నారు. గంగవరంలో వైసిపి కార్యకర్తలు రహదారులపైకి వచ్చి నిరసన తెలిపారు. వి.కోట, వెదురుకుప్పం, బంగారుపాళ్యంలో ర్యాలీ చేశారు. బైరెడ్డిపల్లిలో వైసిపి రాష్ట్ర కన్వీనర్ మొగసాల కష్ణమూర్తి ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. గంగాధర నెల్లూరు మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై వైసిపి కార్యకర్తలు బైఠాయించి ధర్నా నిర్వహించారు. గుడిపాల, జీడినెల్లూరు, పూతలపట్టు, ఐరాల, యాదమరి, తవణంపల్లిలో బంద్ ప్రశాంతంగా సాగింది.

విద్యుత్ భారాలు రద్దు చేయాలి

- స్మార్ట్ మీటర్లు బిగించొద్దు
- సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



సెమినార్‌లో ప్రసంగిస్తున్న టిడిపి నేత సోమిరెడ్డి, వేదికపై వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి (జనచైతన్య వేదిక), ఎన్ తులసిరెడ్డి (కాంగ్రెస్), విద్యుత్ రంగ నిపుణులు బి తులసీదాస్

రాష్ట్ర ప్రజలపై ప్రభుత్వం మోపిన విద్యుత్ భారాలను రద్దు చేయాలని సదస్సులో వక్తలు డిమాండ్ చేశారు. వ్యవసాయ పంపుసెట్లకు, గృహ వినియోగ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లను బిగించొద్దన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విద్యుత్ సంస్కరణలపై ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. 'ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ సంస్కరణలు-ప్రజలపై భారాలు' అనే అంశంపై విజయవాడలోని దాసరి భవన్‌లో జనచైతన్య వేదిక ఆధ్వర్యాన శనివారం సదస్సు జరిగింది. ఈ సదస్సులో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. అదనంగా అప్పులు పొందేందుకు వ్యవసాయ పంపుసెట్లకు రాష్ట్ర ప్రభుత్వం మీటర్లు ఏర్పాటు చేస్తోందని విమర్శించారు. మీటర్ల ఖర్చు తామే భరిస్తామని ప్రభుత్వం చెబుతున్నా చివరకు ప్రజలపైనే భారం పడుతుందన్నారు. మీటర్ల టెండర్‌లో డిస్కమ్‌లు, కాంట్రాక్టరుతో చేసుకున్న ఒప్పందంలో కుంభకోణం జరిగిందని ఆరోపించారు. షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ కంపెనీ కార్యాలయంలో మూడు డిస్కమ్‌ల సిఎమ్‌డిల సమక్షంలో టెండర్ల రూపకల్పన జరిగిందని అన్నారు. ఐదేళ్లల్లో టిడిపి ప్రభుత్వం ప్రజలపై ఎలాంటి విద్యుత్ భారాలు మోపలేదన్నారు. ఎలాంటి భారాలు మోపబోమని చెప్పిన వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే విపరీతమైన భారాలు మోపుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మీడియా కమిటీ ఛైర్మన్ ఎన్ తులసిరెడ్డి మాట్లాడుతూ.. గతంలో విద్యుత్ వైరు పట్టుకుంటే కొట్టే షాక్ ఇప్పుడు బిల్లు ముట్టుకుంటేనే కొడుతుందన్నారు. ఉచిత విద్యుత్ ఎగ్గొట్టి రైతులపై భారాలు మోపేందుకు ప్రభుత్వం చూస్తోందన్నారు. ప్రజాశక్తి సంపాదకులు బి తులసీదాస్ మాట్లాడుతూ.. విద్యుత్ రంగ ప్రైవేటీకరణ కోసం గతంలో ప్రపంచ బ్యాంకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చిందని, ఇప్పుడు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రాష్ట్రాలపై ఒత్తిడి తేస్తోందని అన్నారు. రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం (ఆర్‌డిఎస్‌ఎస్)తో వ్యవసాయ పంపుసెట్లకు, గృహ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు బిగించాలని తీవ్ర ఒత్తిడి తేస్తోందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమం తరువాత రాష్ట్రంలో గృహ వినియోగదారుల ఛార్జీలు పెంచేందుకు ఏ ప్రభుత్వం కూడా సాహసం చేయలేదని చెప్పారు. జగన్ ప్రభుత్వం మాత్రం శ్లాబుల మార్పుతో పేదలపై భారాలు మోపిందన్నారు. గ్రీన్ పవర్ పేరుతో విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారుల కోసం సోలార్, విండ్ విద్యుత్‌లతోపాటు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు (పిఎస్‌పి)లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. ఎటువంటి సంస్కరణలు అమలు చేయబోమని, ఎలాంటి భారాలు వేయకుండా విద్యుత్ రంగాన్ని నడిపిస్తామనే విధంగా పాలకులపై ప్రజల నుంచి ఒత్తిడి పెరగాలని తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి ఓబులేష్ మాట్లాడుతూ.. గతంలో విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉద్యమం చేశారని గుర్తు చేశారు. జగన్ మాత్రం ట్రూఅప్, సర్‌చార్జ్, సర్దుబాటు వంటి రకరకాల పేర్లతో భారాలు మోపుతున్నారని విమర్శించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన జనచైతన్య వేదిక అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి విద్యుత్ సంస్కరణ విషయంలో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు, విద్యుత్ రంగంలో అక్రమాలు, అవినీతిని ప్రజల ముందు ఉంచడానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ సదస్సులో వ్యవసాయ రంగ నిపుణులు అక్కినేని భవానీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నీటి విలువ తెలియని జగన్

- వైసిపి పాలనలో సాగునీటి ప్రాజెక్టులు విధ్వంసం
- మద్యాన్ని ఏరుల్లా పారిస్తున్నాడు
- శ్రీకాళహస్తి నుంచే కురుక్షేత్ర యుద్ధానికి నాంది : చంద్రబాబు
- నెల్లూరు సమావేశం నేటికి వాయిదా

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి (చిత్తూరు జిల్లా), నెల్లూరు ప్రతినిధి



శ్రీకాళహస్తి రోడ్డు షోలో మాట్లాడుతున్న చంద్రబాబు

సాగునీటి విలువ తెలియని వ్యక్తి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని టిడిపి అధినేత చంద్రబాబు విమర్శించారు. వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతిపాలైందని, సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసం జరిగిందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని విమర్శించారు. 'సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి' కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో రోడ్ షో నిర్వహించారు. ఆ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ జగన్ అసమర్ధ పాలన ఎలా ఉందో ఇప్పటికే ప్రజలకు అర్థమైందన్నారు. టిడిపి పాలనలో ప్రాజెక్టులకు రూ.68 వేల కోట్లు ఖర్చు చేస్తే, వైసిపి ప్రభుత్వం కేవలం రూ.22 వేల కోట్లే ఖర్చు చేసిందని తెలిపారు. రాయలసీమ ప్రాజెక్టులకు తాము రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తే, జగన్ రూ.2 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని వివరించారు. గాలేరు నగరి, హంద్రీనీవా, ఎస్‌ఎస్ కెనాల్ సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ఉమ్మడి చిత్తూరు జిల్లా సస్యశ్యామలయ్యేదన్నారు. ప్రతిష్టాత్మక ఈ ప్రాజెక్టులు పూర్తి చేయడం చేతకాని జగన్... గాలేరు-నగరి నుంచి ఓ కాలువను తవ్వేందుకు, ఓ చెరువును నింపేందుకు రూ.8 వేల కోట్లు కేటాయించారని, ఆ సొమ్మంతా మంత్రి పెద్దిరెడ్డి సంస్థ పిఎల్ఆర్ గ్రూపునకు వెళ్లేలా కాంట్రాక్టు ఇచ్చారని విమర్శించారు. మంత్రి పెద్దిరెడ్డి అవినీతిని ప్రశ్నిస్తానని, సాగునీటి ప్రాజెక్టులపై నిలదీస్తానని తనను పుంగనూరు రానీయకుండా పెద్దిరెడ్డి తమ్ముడు అడ్డుకున్నారని విమర్శించారు. పోలీసుల సాయంతో వైసిపి మూకలను ఉసిగొలిపి టిడిపి కార్యకర్తలపై దాడి చేయించారని ఆరోపించారు. ప్రజాక్షేత్రంలో పోరాడుతున్న నన్ను జగన్ బాబాయ్ వివేక మాదిరిగా గొడ్డలిపోటుతో హతమార్చాలని చూశారని దుయ్యబట్టారు. పుంగనూరు విధ్వంస ఘటనకు నన్ను బాధ్యుడిని చేస్తూ ఎస్‌పి ప్రకటన ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పోలీసు యంత్రాంగం అధికార పార్టీ చేతుల్లో కీలుబొమ్మలుగా మారిందా? అని నిలదీశారు. జగన్ వద్ద ఉన్న కొందరు అవినీతి పోలీస్ బాస్‌ల వల్ల రాష్ట్రంలోని పోలీసులు తమ కర్తవ్యాలను వదిలి, మనసు చంపుకుని అధికార పార్టీకి ఊడిగం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. అవినీతి బాస్‌ల ఆదేశాలకు వ్యతిరేకంగా పోలీసులు ఉద్యమించాలన్నారు. శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే బియ్యపురెడ్డి దోపిడీ జరుగుతోందని, ఆయన అవినీతికి అడ్డేలేకుండా పోతోందని, విలువైన భూములను దోచేస్తున్నాడని, ఇసుక మాఫియా, ల్యాండ్ మాఫియా చేస్తూ కోట్లు గడించాడని, శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో రాహు, కేతు టికెట్లల్లో కూడా కమీషన్ తీసుకుంటున్నాడని చంద్రబాబు ఆరోపించారు. తాను అధికారంలోకి వచ్చాక నయా పైసలతో సహా కక్కిస్తానని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో శ్రీకాళహస్తి నుంచి కురుక్షేత్ర యుద్ధానికి నాంది పలకనున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పనబాక లక్ష్మి, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎస్‌సివి నాయుడు, మునిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలస్యంగా నెల్లూరుకు రాక

కాళహస్తి తర్వాత నెల్లూరు నగరంలోని కస్తూర్బా గార్డెన్‌లో మేధావులు, సాగునీటి అనుభవజ్ఞులు, మీడియా మిత్రులతో ప్రత్యేక సమావేశంలో చంద్రబాబు పాల్గొనవలసి ఉంది. రాత్రి 8.30 గంటలకు కూడా నాయుడుపేటకు ఆయన చేరుకోలేదు. దీంతో, నెల్లూరులో జరగాల్సిన కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం 9.30 గంటలకు వాయిదా వేశామని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రకటించారు. రాత్రి బాగా పొద్దుపోయాక చంద్రబాబు నెల్లూరుకు చేరుకున్నారు.

'అసైన్డ్' ఆర్డినెన్స్‌ను ఉపసంహరించండి

- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భూమి లేని గ్రామీణ పేదలు, దళితుల అభ్యున్నతి, ఆత్మగౌరవం, జీవనోపాధి కోసం ఇచ్చిన అసైన్డ్ భూములను అమ్ముకోవచ్చంటూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ప్రభుత్వమే ఈ తరహా ఆర్డినెన్స్‌ను తీసుకురావడాన్ని తీవ్రంగా ఖండించారు. అసైన్డ్ చట్ట సవరణపై అన్ని రాజకీయ, వ్యవసాయ కార్మిక, దళిత సంఘాలతో తొలుత చర్చించాలని ఆయన కోరారు. ఆ తరువాతే ఈ విషయంలో ముందుకు వెళ్లాలని సూచించారు. అన్యాక్రాంతమైన అసైన్డ్ భూముల వివరాలను గ్రామ సచివాలయంలో బహిరంగ పరచాలని కోరారు. రానున్న నెల రోజుల్లోపు అసెంబ్లీ సమావేశాలు ఉండగా ఆగమేఘాలపై ఎవరి ప్రయోజనాల కోసం ఆర్డినెన్స్ తీసుకువచ్చారని ఆయన ప్రశ్నించారు. దీనికి ప్రభుత్వం సమాధానం చెప్పాలని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో కనీసం చర్చించకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకోవడాన్ని సిపిఎం వ్యతిరేకిస్తోందని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న తీరు చూస్తుంటే దళితులు, ఇతర పేదలకిచ్చిన అసైన్డ్ భూములను పెత్తందార్లకు కట్టబెట్టడానికే 9/77 చట్టాన్ని సవరించారని అర్థమవుతోందన్నారు. రెండున్నర ఎకరా మాగాణి, ఐదుఎకరాల మెట్ట ఉన్న రైతులు అసైన్డ్ భూములు కలిగి ఉంటే వారిని మినహాయించాలని కోరారు. రాష్ట్రంలో వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆందోళనల ఫలితంగా సుమారు 32 లక్షల ఎకరాల భూమి పేదలకు పంపిణీ జరిగిందని, ఇందులో సుమారు 15 లక్షల ఎకరాలకు పైగా అన్యాక్రాంతమైనట్లు కోనేరు రంగారావు భూ కమిటీ తేల్చిందని లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వాలు పంపిణీ చేసిన భూమిని అనేక చోట్ల భూస్వాములు, పలుకుబడి కలిగిన వారు పారిశ్రామిక కేంద్రాలు, ఆక్వా చెరువులు, విద్యాలయాలు, నేషనల్ హైవేలు, విమానాశ్రయాలు పక్కనున్న దళితులకు చెందిన అసైన్డ్ భూములను దౌర్జన్యంగా లాక్కున్నారని వివరించారు. కొన్ని చోట్ల పేదల బలహీనతను ఉపయోగించుకొని పావలో, పాతికో ఇచ్చి వారి భూముల్లో కలిపేసుకున్నారని,అన్యాక్రాంతమైన భూములను తిరిగి ఆ పేదలకే ఇవ్వాలని 9/77 చట్టం చెబుతోందని తెలిపారు. ఈ చట్టం ఉండబట్టే భూములు కోల్పోయిన పేదలు పోరాడో, న్యాయస్థానాలను ఆశ్రయించో తిరిగి పొందుతున్నారని గుర్తు చేశారు. వైసిపి ప్రభుత్వం ఈ భూములను కార్పొరేట్ కంపెనీలకు, రియల్టర్లకు, భూస్వాములకు కట్టబెట్టడానికే చట్ట సవరణ చేసి గవర్నర్ ద్వారా జూలై 31న ఆర్డినెన్స్ తీసుకొచ్చిందని తెలిపారు. సవరించిన సెక్షన్ 3లో అసైన్డ్ భూమి మాస్టర్ ప్లాన్ పక్కన వ్యవసాయేతర అవసరాల కోసం (పరిశ్రమలు, విద్యాలయాలు, ఆక్వా, ఇతరములు) ఆక్రమించుకున్నట్లయితే ఆ భూములకు మార్కెట్ ధర ప్రకారంగా అసైన్డ్‌దారులకు డబ్బు చెల్లించాలని పేర్కొన్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ సవరణ ద్వారా ఇప్పటికే అన్యాక్రాంతమైన భూములను ఇలాంటి తప్పుడు పద్ధతుల పేరుతో రాజమార్గంలో కొట్టేయడానికి భూస్వాములకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని విమర్శించారు. దురాక్రమణ చేసిన ఆక్వా, రియల్ ఎస్టేట్, పరిశ్రమలు పెట్టని ఖాళీ భూములను అసలు అసైన్డ్‌దారుల పరం చేయాలని డిమాండు చేశారు. పేదలు పొందిన అసైన్డ్ భూములను అభివృద్ధి చేసుకుని వారి జీవితాలు, పిల్లల భవిష్యత్ అభివృద్ధి చేసుకోవడానికి పెట్టుబడి, సాగునీటి సౌకర్యం, పరపతి సౌకర్యం కల్పించి అభివృద్ధి చేయాల్సింది పోయి భూములు అమ్ముకోవచ్చని ప్రోత్సహించడం అభివృద్ధి నిరోధక చర్యని తెలిపారు. ప్రభుత్వం తెచ్చిన సవరణ, అసైన్డ్ భూముల హక్కుదారుల కంటే అక్రమంగా, దౌర్జన్యంగా అనుభవిస్తున్న భూస్వాములకు మేలు చేయడానికే ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.



అంబేద్కర్ విగ్రం ఎదుట నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

చంద్రబాబుపై దాడి గర్హనీయం

- కడప అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసనలో నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు పర్యటించిన చిత్తూరు జిల్లా పుంగనూరులో వైసిపి నాయకులు, కార్యకర్తలు జెండాలు పట్టుకుని వచ్చి రాళ్లదాడి చేయడం గర్హనీయమని టిడిపి రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎం.పి.సురేష్ అన్నారు. చంద్రబాబుపై రాళ్లదాడిని ఖండిస్తూ కడప జిల్లా అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు పర్యటన ఉందని తెలిసి పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారని విమర్శించారు. రాళ్ల దాడి చేసింది వైసిపి నాయకులు, కార్యకర్తలేనని ఆరోపించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర హోంశాఖ చర్యలు తీసుకోవాలని కోరారు. చంద్రబాబుకు భద్రత పెంచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కడప పార్లమెంట్ మీడియా కో-ఆర్డినేటర్ జనార్ధన్, బెస్తసాధికర కమిటీ రాష్ట్ర కన్వీనర్ రామప్రసాద్, ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గురప్ప, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జియాదుద్దీన్, 46వ డివిజన్ ఇన్‌ఛార్జీ భరత్ పాల్గొన్నారు.



నంద్యాలలో మాట్లాడుతున్న రమాదేవి

మహిళలపై దాడులు అరికట్టేందుకు అధ్యయన కమిటీ వేయాలి

- మహిళా పోరుయాత్రలో డిమాండ్

ప్రజాశక్తి - యంత్రాంగం

మహిళల హక్కులను నిరాకరించడమంటే రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని ఐద్వా నాయకులు విమర్శించారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి నిపుణులతో అధ్యయన కమిటీ వేయాలని, మహిళలకు, చిన్నారులకు రక్షణ కల్పించే చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో ప్రారంభమైన 'మహిళా పోరుయాత్ర' శనివారం కర్నూలు మీదుగా నంద్యాలకు, విశాఖలో ప్రారంభమైన యాత్ర ఏలూరు మీదుగా కృష్ణా జిల్లాలోకి ప్రవేశించింది. ఏలూరులోని సిఆర్‌ఆర్ ఫార్మసీ వైద్య విద్యార్థులతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి మాట్లాడుతూ.. మహిళలపై దాడుల కేసులను త్వరితగతిన విచారణ పూర్తి చేయడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మీడియాతో కలిపి మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని, హింస, అశ్లీలత, అసమానతలను ప్రేరేపించే సినిమాలు, టీవీ సీరియళ్లు, ఇంటర్‌నెట్ కార్యక్రమాలను నిషేధించాలని కోరారు. కాలేజీల్లో మహిళలు పనిచేస్తున్న ప్రదేశాల్లో వేధింపులను నిరోధించేందుకు అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలని, మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మండలానికి ఒక మద్యం షాపు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.సత్యవతి మాట్లాడుతూ.. పురుషులు, మహిళల సమానత్వమనే ఆలోచనలను విద్యార్థి దశలోనే పెంపొందించుకోవాలన్నారు. మహిళలపై దాడులను అరికట్టడానికి అనేక చట్టాలున్నాయని, కానీ వాటిని అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. కృష్ణా జిల్లా బాపులపాడు ఎంజి నగర్, గుడివాడ వికెఆర్ విఎన్‌బి కళాశాల, మచిలీపట్నం లేడీ యాంప్తిల్ కళాశాలల్లో జరిగిన సభల్లో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పూర్ణ మాట్లాడారు. మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు జరుగుతూనే ఉన్నా... కేంద్రం మౌనం వహించడం సిగ్గుచేటన్నారు. మణిపూర్ ఘటన దేశాన్ని కుదిపేసినా ప్రధాని మోడీ నోరుమెదపడం లేదన్నారు.

నంద్యాల గాంధీ చౌక్‌లో ఏర్పాటు చేసిన సభలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ.. మహిళల పట్ల బిజెపి నాయకత్వం వ్యవహరిస్తున్న తీరును దుయ్యబట్టారు. అత్రాస్, కత్వ, గుజరాత్, ఉద్ధవ్ వంటి ప్రాంతాల్లో మహిళలపైన అఘాయిత్యాలు చేసిన నిందితులకు రక్షణ ఇస్తున్న మణిపూర్ ప్రభుత్వానికి అధికారంలో ఉండే అర్హత లేదన్నారు. మహిళాలు బతకాలంటే ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలను ప్రజా చైతన్యంతో పారద్రోలాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కోశాధికారి సావిత్రి మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలన్నారు. హింస లేని సమాజాన్ని నిర్మిద్దామనే పేరుతో మహిళా సంఘం ఆధ్వర్యంలో బస్సు యాత్ర ప్రారంభం అయిందని తెలిపారు. సాంస్కృతిక చైతన్య కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పంచాయతీ నిధులు దుర్వినియోగం : పవన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అధికార వికేంద్రీకరణ జరగాలని, గ్రామ పంచాయతీల నిధులను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో శనివారం గ్రామ సర్పంచులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పాలన కూడా సిఎం కార్యాలయం నుంచి జరగాలనుకోవడం సరికాదన్నారు. పంచాయతీల నిధులను ప్రభుత్వం దారి మళ్లించిన అంశాన్ని తాను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. వలంటీర్లు అనే సమాంతర వ్యవస్థతో సర్పంచులు డమ్మీలుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. తొలుత గల్ఫ్ ఎన్‌ఆర్‌ఐలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గల్ఫ్ ఎన్ఆర్ఐలు పార్టీకి రూ.కోటి విరాళం అందజేశారు.

7 నుంచి జాతీయ చేనేత వారోత్సవాలు

- ఆప్కో ఎమ్‌డి ఎంఎం నాయక్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించు కుని ఈ నెల 7 నుంచి 12 వరకు చేనేత వినియోగాన్ని ప్రోత్సహించేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆప్కో ఎమ్‌డి ఎంఎం నాయక్ తెలిపారు. వారోత్సవాలు సందర్భంగా చేనేత వస్త్రాలపై ప్రత్యేక డిస్కౌంట్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడ ఎన్‌టిఆర్ సర్కిల్ సమీపంలోని మేరీస్ స్టెల్లా కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్న ఈ చేనేత వారోత్సవాలను సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. జాతీయ స్థాయిలో పేరు ప్రతిష్టలు గడించిన 50కు పైగా చేనేత ఉత్పత్తి సంఘాలు స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నాయని పేర్కొన్నారు. మొదటి రోజు సాయంత్రం ఆప్కో నేతృత్వంలో చేనేత ఫ్యాషన్ షో నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 4వ జాతీయ చేనేత జనాభా నివేదిక ప్రకారం సుమారు 1,22,644 మంది చేనేత కార్మికులు ప్రత్యక్షంగా, 49,785 మంది చేనేత అనుబంధ కార్యకలాపాలలో ఉపాధి పొందుతున్నారని అన్నారు.

ఈ ఏడాది రూ.50 కోట్లు చేనేత వ్యాపారం చేయాలనే లక్ష్యంతో ఆప్కో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తుందన్నారు. ఆప్కో చేనేత వస్త్ర శ్రేణిని అందుబాటులో ఉంచేందుకు విజయవాడ (గన్నవరం), తిరుపతి (రేణిగుంట), విమానాశ్రయాలు, హైదరాబాద్ మొహిదీపట్నం నందు ఆప్కో షోరూమ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు.

అక్టోబరు 30న ఆశా వర్కర్ల చలో ఢిల్లీ

ఫెడరేషన్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి మధుమిత బందోపాధ్యాయ



సమావేశంలో మాట్లాడుతున్న ఆశా వర్కర్స్ అండ్ ఫెసిలిటేటర్స్ ఫెడరేషన్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి మధుమిత బందోపాధ్యాయ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆశా వర్కర్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని, దీనికి నిరసనగా అక్టోబరు 30న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆశా వర్కర్స్ అండ్ ఫెసిలిటేటర్స్ ఫెడరేషన్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి మధుమిత బందోపాధ్యాయ తెలిపారు. రెండు రోజులపాటు వడ్డేశ్వరంలో జరిగిన ఫెడరేషన్ ఆలిండియా సమావేశాల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కోవిడ్‌లో ప్రాణాలకు తెగించి పనిచేసిన ఆశావర్కర్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని తెలిపారు. కనీస వేతనం, చట్టబద్ధమైన సౌకర్యాల కోసం వివిధ రాష్ట్రాల్లోని ఆశా వర్కర్లు ఉమ్మడి పోరు నిర్వహించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించి చెల్లించాలని, తొలగింపులు, వేధింపులు ఆపాలని కోరారు. ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్స్ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని అన్నారు. బీహార్లో జులై 12 నుండి సమ్మె జరుగుతోందని, అది న్యాయ సమ్మతమైందని దేశవ్యాప్తంగా ఉన్న వర్కర్లందరూ మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మోడీ ప్రభుత్వానికి ఆశా వర్కర్లతో చాకిరీ చేయించుకోవడం తప్ప వారిగోడు వినడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐక్యపోరాటాల ద్వారా సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని, దీనిలో భాగంగా ఈ నెల 24న ఢిల్లీలో జరిగే స్కీమ్ వర్కర్ల సదస్సుకు ఆశా వర్కర్లకు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రాబోయే కాలంలో స్కీమ్ వర్కర్లతో కలిసి పోరాడేందుకు ఆశాలు సిద్ధంగా ఉండాలని సూచించారు. మణిపూర్లో మతాల మధ్య చిచ్చుపెట్టి మహిళల మాన ప్రాణాలను బలితీసుకుంటున్నారని అన్నారు. ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి హత్య చేసిన ఘటనతో దేశం పరువు పోయిందన్నారు. బిజెపి ఓట్ల రాజకీయాల కోసం బలహీనవర్గాలను, మైనార్టీలను బలితీసుకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. అదానీ, అంబానీలకు లాభం చేకూర్చిపెట్టేందుకు మోడీ నిరంతరం పనిచేస్తున్నారే తప్ప ప్రజల బాగోగులు పట్టడం లేదని అన్నారు. కార్మికులను కట్టు బానిసలుగా మార్చే మోడీ విధానాలకు వ్యతిరేకంగా తొమ్మిదో తేదీన ఆల్ ట్రేడ్ యూనియన్స్ దేశ వ్యాప్తంగా జరిపే క్విట్ మోడీ, సేవ్ ఇండియా కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఆగస్టు 14న సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా మోడీ విధానాలను ఎండగట్టాలన్నారు. సమావేశాలు ప్రారంభంగా ఫెడరేషన్ అధ్యక్షులు పిపి ప్రేమ సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఉపాధ్యక్షులు వీణాగుప్త సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. మణిపూర్‌లో మైనార్టీలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ అఖిల భారత ఉపాధ్యక్షులు కె ధనలక్ష్మి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని కోశాధికారి పుష్ప బలపరిచారు. ఆశా వర్కర్ల సమ్మెను బలపరుస్తూ సురేఖ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఎటి పద్మనాభన్ బలపరిచారు. అన్ని తీర్మానాలను కమిటీ ఏకగ్రీవంగా బలపరిచింది.


తొలి సంతకం చేస్తున్న ప్రజా వైద్యులు తెప్పల ఆనంద్

జీడి 'మద్దతు'కు లక్ష సంతకాల సేకరణ

- పలాసలో ప్రారంభం

ప్రజాశక్తి - పలాస

రైతుభరోసా కేంద్రాల ద్వారా జీడి పిక్కలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేల మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేస్తూ జీడి రైతు సంఘం ఆధ్వర్యాన శనివారం లక్ష సంతకాల సేకరణ ఉద్యమం చేపట్టారు. శ్రీకాకుళం జిల్లా పలాసలోని కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద ప్రముఖ ప్రజా వైద్యులు తెప్పల ఆనంద్ తొలి సంతకం చేసి ప్రారంభించారు. పెద్దసంఖ్యలో జీడి రైతులు, ప్రజలు పాల్గొని సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీడి రైతులు చేస్తున్న ధర్మ పోరాటానికి మద్దతుగా అందరూ సంతకాలు చేయాలని కోరారు. జీడి రైతులకు మద్దతు ధర ఇవ్వడం ద్వారా జీడి పరిశ్రమలు అభివృద్ధి చెంది వేలాది మంది కార్మికులు ఉపాధి పొందుతారని తెలిపారు. తద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ మాట్లాడారు. జీడి రైతుల ఆత్మహత్యలకు ప్రభుత్వమే కారణమన్నారు. జీడికి మద్దతు ధర లేకపోవడంతో జీడి రైతులు తీవ్ర దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2019లో 80 కేజీల జీడి పిక్కల బస్తా రూ.14 వేలు ఉంటే, నేడు రూ.ఏడు వేలకు పడిపోయిందని దీనికి కారణం ఎవరని ప్రశ్నించారు. జీడిపప్పు ధర ఆకాశాన్ని అంటుతుంటే జీడి పిక్కల ధర పాతాళానికి పడిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు నెలలుగా జీడి రైతులు పలురూపాల్లో పోరాడుతున్న ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. రూ.16 వేలు మద్దతు ధర ఇవ్వాలని, కేరళ తరహాలో జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జీడి పంటకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు అంబటి రామకృష్ణ, కె.సింహాచలం, తెప్పల రాజు తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం కోసం వరద బాధితుల రాస్తారోకో

ప్రజాశక్తి - ఎటపాక (అల్లూరి సీతారామరాజు జిల్లా)


నెల్లిపాక జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న వరద బాధితులు, సిపిఎం నాయకులు

వరదలకు, వర్షాలకు అన్ని విధాలా నష్టపోయిన తమకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలంటూ సిపిఎం ఆధ్వర్యాన నెల్లిపాక జాతీయ రహదారిపై నెల్లిపాక గ్రామస్తులు శనివారం రాస్తారోకో చేశారు. 15 రోజులపాటు వర్షాలు కురిసి, గోదావరి వరద పోటెత్తడంతో తామంతా కష్టాలపాలయ్యామని, ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయని వారు ఆవేదన వ్యక్తం చేశార. తమకు నష్టపరిహారం ఇవ్వాలని అధికారులను అడిగితే 'మీ ఇళ్లకు వరద నీరు పట్టలేదు కదా. ఇంట్లోకి నీళ్ల వస్తేనో, ఇల్లు గోదావరిలో మునిగితేనే నష్టపరిహారం ఇస్తాం' అని అధికారులు వితండవాదం చేస్తూ రెక్కాడితేగానీ డొక్కాడని తమపై ప్రతాపం చూపడం సరికాదన్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోనే తామంతా రోడ్డెక్కాల్సి వచ్చిందని తెలిపారు. అనంతరం నెల్లిపాక సచివాలయంలో సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరావు, నాయకులు ఆకిశెట్టి రాము, వెంకన్న, హరినాథ్, వెంకటలక్ష్మి, వెంకటేశ్వర్లు, ఎస్‌కె.ఆశాబీ తదితరులు పాల్గొన్నారు.

నష్టాన్ని అంచనా వేయాలి

- సిపిఎం బృందం డిమాండ్

ప్రజాశక్తి-మామిడికుదురు

ఇటీవల వరద ప్రభావంతో నష్టపోయిన పంట నష్టాన్ని ఎమ్యునరేషన్ పూర్తి చేసి ఆ జాబితాను సచివాలయంలో బహిరంగ పరచాలని ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర బృందం డిమాండ్ చేసింది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని వరద ప్రభావిత గ్రామాల్లో శనివారం ఈ బృందం పర్యటించింది. సిపిఎం రాష్ట్ర నాయకులు ఎం.హరిబాబు, అంద్ర మాల్యాద్రి, దడాల సుబ్బారావు, మర్రాపు సూర్యనారాయణ, జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరావు తదితరులు బృందంలో ఉన్నారు. మామిడికుదురు మండలం అప్పనపల్లిలో రైతులతో మాట్లాడారు. జిల్లాలో 20 వేల ఎకరాల్లో సార్వా పంట, వరి, అరటి, కాయగూరలు, తమలపాకు తదితర పంటలు దెబ్బతిన్నాయని, వరి పంటకు ఎకరాకు రూ.30 వేల నష్టపరిహారం చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు. గతేడాది నష్టపరిహారాన్ని నేటికీ



చెల్లించలేదని, ఈ ఏడాది దెబ్బతిన్న ఇళ్లకు కూడా నష్టపరిహారం, పక్కా గృహాలు ఇవ్వాలని, వరద బాధితులందరికీ 50 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గాప్రసాద్, పీతల రామచంద్రరావు, తాడి శ్రీరామ్మూర్తి, రాజశేఖర్ ఉన్నారు.


చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా విజయవాడ రైల్వే స్టేషన్లో పోలవరం నిర్వాసితులు

చలో ఢిల్లీకి పోలవరం నిర్వాసితులు పయనం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

తమ సమస్యలను పరిష్కరించాలంటూ తలపెట్టిన 'చలో ఢిల్లీ' కార్యక్రమానికి పోలవరం నిర్వాసితులు విశాఖపట్నం రైల్వే స్టేషన్ నుంచి ఢిల్లీకి సమతా ఎక్స్‌ప్రెస్‌లో శనివారం ఉదయం బయలు దేరారు. సిపిఎం నాయకులు వారికి సంఘీభావం తెలిపి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు శాశ్వత పునరావాసం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేశాకే ప్రాజెక్టు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే తమ సమస్యలపై నిర్వాసితులు ఎటపాక నుంచి విజయవాడ వరకూ సుమారు 400 కిలో మీటర్ల వరకు మహాపాదయాత్ర చేపట్టారన్నారు. కేంద్ర ప్రభుత్వం గిరిజనుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం అవలంబిస్తోందని విమర్శించారు. ఈ క్రమంలోనే ఈ నెల 7న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద పెద్ద ఎత్తున పోలవరం నిర్వాసితులు ధర్నా చేపట్టనున్నారని తెలిపారు. ఈ ప్రాజెక్టు వల్ల లక్ష మంది గిరిజనులు ముంపునకు గురవుతారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీరి పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల వచ్చిన వరదలకు గిరిజనులందరూ ముంపునకు గురైతే ప్రభుత్వం సరైన రీతిలో స్పందించలేదన్నారు. పునరావాస కేంద్రాలలో ఉన్నవారికి ఒక బిస్కెట్ ప్యాకెట్, పాల ప్యాకెట్, అరకిలో ఉల్లిపాయలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ఢిల్లీ వెళ్తున్న వారిలో సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి రవి, ముంపు ప్రాంతాల నాయకులు ఉన్నారు. ఢిల్లీకి వెళ్లే వారికి వీడ్కోలు పలికిన వారిలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, నాయకులు జి.అప్పలరాజు, టి.నూకరాజు, ఎం.సూరీడు, ఎ.సింహాచలం ఉన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశే లక్ష్యంగా

వైద్య రంగంలో సంస్కరణలు

- మంత్రి విడదల రజని

ప్రజాశక్తి-విజయనగరం


వైద్య కళాశాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రులు రజని, బొత్స

ఆరోగ్య ఆంధ్రప్రదేశే లక్ష్యంగా రాష్ట్రంలో వైద్య రంగంలో భారీ సంస్కరణలు తీసుకొచ్చామని, దాని ఫలితంగానే అత్యున్నత ప్రమాణాలతో కూడిన వైద్య విద్య సులభంగా పేద విద్యార్థులకు చేరువవుతోందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజని అన్నారు. విజయనగరంలో 70 ఎకరాల్లో రూ.500 కోట్లతో నిర్మిస్తున్న వైద్య కళాశాల నిర్మాణ పనులను విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో కలిసి ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తొలి విడతలో ఈ విద్యా సంవత్సరం నుంచి ఐదు కళాశాలలను అందుబాటులోకి తీసుకురానున్నామన్నారు. విజయనగరం మెడికల్ కాలేజీతోపాటు మిగిలిన నాలుగు కళాశాలలను విజయనగరం వేదికగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారని వెల్లడించారు. ఈ ఐదు కళాశాలల్లో 750 సీట్లను భర్తీ చేస్తామని తెలిపారు. జీరో వేకెన్సీ పాలసీలో భాగంగా వైద్య రంగంలో 50 వేలకుపైగా ఉద్యోగ నియామకాలు చేపట్టామని తెలిపారు. ఆరోగ్యశ్రీలో 3,257 రకాల రోగాలకు సేవలందిస్తున్నామని, వైఎస్‌ఆర్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ విధానం అందుబాటులోకి తీసుకొచ్చామని, రూ.16 వేల కోట్లతో నాడు-నేడు పనులు చేపట్టామని వెల్లడించారు. మంత్రి బొత్స మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చి నాటికి నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. వైద్య కళాశాల ప్రారంభోత్సవంతో పాటు, గిరిజన యూనివర్సిటీ పనులకు శంకుస్థాపన చేయనున్నామని చెప్పారు.

ఎసి బిల్లుల రగడ

- సమగ్రంగా లేవంటున్న ఎజి కార్యాలయం
- అధ్యయనానికి బృందం ఏర్పాటు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఎజి కార్యాలయం, ఆర్థికశాఖ మధ్య ఎసి (అబ్‌స్ట్రాక్ట్ కంటింజెంట్) బిల్లుల వివాదం ముదురుతోంది. తమకు బిల్లులు సక్రమంగా అందడం లేదని ఎజి కార్యాలయం చెబుతుండగా, తాము వివరాలు ఇస్తున్నా అభ్యంతరాలు లేవనెత్తుతున్నారని ట్రెజరీ కార్యాలయ అధికారులు అంటున్నారు. ఇలా అపరిష్కృతంగా ఉన్న బిల్లులు 1,312 కోట్లుగా ఉన్నట్లు తేలింది. ఇదే అంశంపై ఎగ్జిట్ కాన్ఫరెన్స్‌లో కూడా విస్తృత చర్చ జరిగినట్లు తెలిసింది. ఎసి బిల్లులపై తమకు సరైన సమాచారం రావడం లేదని ఎజి అధికారులు చెబుతున్నారు. అనేక ఎసి బిల్లులపై ఓచర్లు, సబ్ ఓచర్లు రావడం లేదని,దీనివల్ల తుది గణాంకాలను కూడా సిద్ధం చేయలేకపోతున్నామని చెప్పినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అటువంటి బిల్లుల వివరాలు తమకు ఇవ్వాలని ఆర్థిక శాఖ కార్యదర్శి ఎజి అధికారులను కోరినట్లు తెలిసింది.కాగా ఈ వ్యవహారంలో పరిష్కారాలు సాధించేందుకు ఒక కమిటీ ఏర్పాటుచేస్తే బాగుంటుందని ఎజి కార్యాల్య అధికారులు అభిప్రాయపడ్డారు. ఇందులో ఆర్థికశాఖతోపాటు ఎజి కార్యాలయ అధికారులు కూడా ఉండాలని సూచించారు. దీనిపై కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ట్రెజరీ అధికారులను ఆర్థికశాఖ కార్యదర్శి ఆదేశించారు.

ఆర్డినెన్స్‌ను ఉపసంహరించుకోవాలి

- వ్యవసాయ కార్మిక సంఘం నిరసనలకు కెవిపిఎస్ మద్దతు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అసైన్డ్ భూములు అమ్ముకోవచ్చని తీసుకొచ్చిన ఆర్డినెన్సును ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో సంప్రదించి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు ఆందోళన ఫలితంగా సుమారు 32 లక్షల ఎకరాల భూములు పంపిణీ జరిగిందని, ఇందులో సుమారు 15 లక్షల ఎకరాలకు పైగా అన్యాక్రాంతమైనట్లు కోనేరు రంగారావు కమిటీ చెప్పిందని అన్నారు. అసైన్డ్ భూములు అమ్ముకోవచ్చని ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను ఉపసంహరించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం చేపట్టిన నిరసనలకు తాము సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అంద్ర మాల్యాద్రి పేర్కొన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. అన్యాక్రాంతమైన అసైన్డ్ భూముల వివరాలు గ్రామ సచివాలయాల్లో బహిరంగ పరచాలని వారు డిమాండ్ చేశారు.

ఇవ్వకపోతే లాగేసుకుంటాం..

- ఎటపాక మండలం బాసవాడ ప్రజలకు అధికారుల బెదిరింపులు
- 400 ఎకరాలు ఇవ్వాలని హెచ్చరిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'మీ పొలం ఇవ్వండి లేకపోతే లాగేసుకుంటాం, ఎన్ని ఎకరాలు ఇచ్చినా రూ.5 లక్షలు పరిహారం ఇస్తాం' అని రెవెన్యూ అధికారులు ముంపు మండలాల ప్రజలపై బెదిరింపులకు దిగుతున్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పర్యటన సందర్భంగా ఈ బెదిరింపుల వ్యవహారం బయటకు వచ్చింది. పోలవరం బ్యాక్‌వాటర్ వల్ల ముంపునకు గురవుతున్న ఎటపాక మండలంలోని బాసవాడ గ్రామంలో సుమారు 200 మంది దళిత కుటుంబాలు ఉంటున్నాయి. సుమారు 400 ఎకరాలను వీరి కుటుంబాలు 50 ఏళ్లకుపైగా సాగు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల రెవెన్యూ అధికారులు ఆ గ్రామానికి వచ్చి రైతులతో సమావేశం ఏర్పాటుచేశారు. మీ గ్రామంలో భూమి అవసరం ఉందని, 400 ఎకరాలు ప్రభుత్వానికి ఇచ్చేయాలని అల్టిమేటం ఇచ్చారు. దీనిపై రైతులు అభ్యంతరం తెలిపారు. తాము భూములు ఇవ్వబోమని, దశాబ్దాల తరబడి వంశపారంపర్యంగా సాగు చేసుకుంటున్నామని అన్నారు. అయితే ముంపు పరిధిలో ఉన్నందున ఇవ్వాల్సిందేనని, ఇవ్వకపోతే తామే తీసేసుకుంటామని, నోటిఫికేషన్ ఇచ్చేస్తామని బెదిరింపులకు దిగారు. అయితే రైతులకు ఎన్ని ఎకరాలు ఇచ్చినా కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం మాత్రమే ఇస్తామని తెలిపారు. దీనిపైనా రైతులు ప్రశ్నించారు. చట్ట ప్రకారం ప్రాజెక్టు పరిధిలో ఉన్నందున పరిహారం ఇవ్వాల్సిన అవసరం లేదని, ఒకవేళ ఇవ్వాల్సి వస్తే ఎంత భూమి ఇస్తే అంత ఇవ్వబోమని, రెండున్నర ఎకరాలకంటే ఎక్కువ ఉన్నా రూ.ఐదు లక్షల పరిహారం మాత్రమే ఇస్తామని తెలిపారు. దీంతో ఏమి చేయాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకవేళ ఇవ్వకపోతే మీ భూముల్లో సాగుకు ప్రభుత్వం అంగీకరించబోదని బెదిరించారు. రైతులను ఎన్ని రకాలుగా బెదిరించాలో అన్ని రకాలుగా వారు బెదిరింపులకు దిగారు. తాము నిరుపేదలమని, తినడానికి అండగా ఉన్న పొలం ఇచ్చేస్తే ఎలా బతకాలని వారు అధికారులను ప్రశ్నించారు. దీనికి స్పందించిన అధికారులు భవిష్యత్‌లో మీ భూముల్లో జరిగే పనుల్లో మీకే కూలిపని ఇప్పిస్తామని హేళనగా మాట్లాడారు. దీంతో మానసికంగా ఇబ్బంది పడ్డ ప్రజలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక పోలవరం సమస్యలపై నికరంగా, నిజాయతీగా పోరాడుతున్న సిపిఎం నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. గురువారం ముంపు ప్రాంతాల పర్యటనకు వెళ్లిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు దృష్టికి తెచ్చారు. మీరే న్యాయం చేసేలా చూడాలని వేడుకున్నారు. దీనిపై బాధితుడు సర్వయ్య మాట్లాడుతూ.. తమ తాతల కాలం నుండి ఇక్కడ సాగు చేసుకుంటున్నా మని, అధికారులు ఇబ్బందులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. తాము మనుషులమేనన్న విషయాన్ని అధికారులు గుర్తించాలని, తమతో మాట్లాడే సమయంలో అసలు మనుషులుగా గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సంపాదకీయం


కళల కలనేత చేనేత

ఉలితో ఊహలకు రూపాలు కల్పించి, శిలకు కళాకాంతులు తెస్తాడు శిల్పి. కుంచె పట్టుకుని ఎంచుకున్న భావాలకు రూపురేఖలు తొడుగుతాడు చిత్రకారుడు. నేర్పుగా సారె తిప్పే కుమ్మరి రకరకాల ఆకృతులలో మట్టిపాత్రలను తయారుచేస్తాడు. నూలు వడికి మగ్గం ఎక్కించి అందమైన వస్త్రాలను రూపొందిస్తాడు నేతన్న. ఇదొక అద్భుతమైన కళ. మనిషి బతకడానికి అవసరమైన కూడు, గూడు, గుడ్డ, నీరు ఎంతో ప్రధానం. ప్రపంచానికి ఆహారాన్ని అందించే రైతన్న ఎంత అవసరమో, వస్త్రాన్ని అందించే నేతన్న కూడా అంతే ప్రధానం. మనిషికి ప్రతి దశలోనూ వస్త్రాల యొక్క ప్రాముఖ్యత అనివార్యం. మానవాళికి చేనేత వస్త్రాలను అందించిన ఘనత... అగ్గిపెట్టెలో పట్టే ఆరడుగుల చీరను నేసి ప్రపంచాన్ని అబ్బురపరచిన చరిత్ర... మన నేతన్నల నిపుణతకు నిదర్శనం. 'మైజారు కొంగున జరీ నిగనిగ, ఆమె కళ్లల్లోనూ, చెక్కిళ్ళమీదా, పెదవుల మీదా తళుక్కుమంది' అంటాడు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి తన 'పుల్లంపేట జరీచీర' కథలో. 'చేనేత సాహిత్యం తెలుపు... చంద్రునికో నూలుపోగు చందం' అన్నట్లుగా చేనేతల జీవితాలపై సాహిత్యంలోనూ అనేక కథలు, కవితలు వచ్చాయి. చేతి నైపుణ్యంతో అందమైన చీరలను సష్టించడం నేతన్నకు మాత్రమే సాధ్యం. నేత చీర దర్పాన్ని ప్రదర్శిస్తుంది, సహజంగా కనిపిస్తుంది. 'మనసు మమత పడుగు పేక చీరలో చిత్రించినాను/ ఇది ఎన్నో కలల కలనేత నా వన్నెలరాశికి సిరిజోత' అంటాడు ఆరుద్ర. సందర్భం ఏదైనా... మహిళలకు వన్నెతెచ్చేది మాత్రం చేనేత చీర. భారతీయ సాంస్కృతిక కళావైభవంలో ఒకటైన చేనేత కళ ప్రపంచానికే ఆదర్శం.

భారత స్వాతంత్ర్యోద్యమంలో ప్రధాన భూమిక పోషించింది చేనేత. 1905 ఆగస్టు 7న కలకత్తాలో మొట్టమొదటగా స్వదేశీ ఉద్యమానికి అంకురార్పణ జరిగింది. విదేశీ వస్త్రాలను బహిష్కరించి, స్వదేశీ వస్త్రాలనే ధరించాలన్న నినాదం ఉవ్వెత్తున ఎగసింది. అంతటి సుదీర్ఘమైన చరిత్ర చేనేతది. భారతీయుల జీవితంతో పెనవేసుకొని, భారతీయ సంస్కృతికి అద్దం పడుతుంది చేనేత. 'ఏదైనా జాతీయ విద్యావిధానంలో నూలు వడకడం, నేయడం ఒక అవసరమైన భాగంగా నేను భావిస్తాను' అంటారు గాంధీజీ. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న చేనేత వస్త్రాల్లో 95 శాతం భారత్‌లోనే ఉత్పత్తి అవుతోంది. దేశంలోని చేనేత రంగంలో కోటీ 30లక్షల మందికి పైగా ప్రత్యక్షంగానూ, మరో 9 కోట్ల మందికి పైగా పరోక్షంగానూ ఆధారపడి వున్నారు. భారతదేశంలో చేనేత పరిశ్రమ గణనీయమైన ఆర్థిక ప్రాముఖ్యతను కలిగివుంది. వ్యవసాయం తర్వాత అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్నది చేనేతరంగమే. 17, 18 శతాబ్దాల నాటికి ప్రపంచ వస్త్ర వ్యాపారంలో 25శాతం వాటా మన దేశానిదే. ఎప్పటికప్పుడు తమ నైపుణ్యాన్ని మెరుగుపర్చుకుంటూ ఖ్యాతిగడించారు మన నేతన్నలు. ఇప్పటికీ వందలాది కుటుంబాలు చేనేత వృత్తినే జీవనోపాధిగా చేసుకున్నాయి. ఉత్పత్తి వివిధ దశల్లో స్త్రీ పురుషులిద్దరి భాగస్వామ్యం వుంటుంది.

మానవాళికి వస్త్రాన్ని అందించిన నేతన్న బతుకు నేడు ఆధునిక యంత్రాలతో పోటీపడలేక ఛిద్రమైంది. కుట్టులేకుండా మువ్వన్నెల జెండా నేసిన నేతన్నకు చేయూత కరువైంది. ఎన్ని కష్టాలెదురైనా... తమ వారసత్వ వృత్తిని, కళను కాపాడుకుంటున్న నేతన్న... బతుకు చిత్రం కళ తప్పి వెలిసిన వస్త్రంలా మారిపోయింది. పొట్ట చేత పట్టుకొని మరమగ్గాలపై పనిచేసేందుకు, ఇతర వృత్తులకు పొరుగు రాష్ట్రాలకు వలసపోతున్నారు. అప్పులు చేసి మర మగ్గాలు కొనుక్కున్నా.. ముడిసరుకు అందుబాటులో లేక, చేసిన అప్పులు తీరక... ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితి నుంచి నేతన్నను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. ప్రాచీనమైన చేనేత కళా వైభవాన్ని... ఆధునికతను జోడించి భవిష్యత్తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై వుంది. భారతదేశ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడం, చేనేత కార్మికులను శక్తివంతం చేయడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రతియేటా ఆగస్టు 7 నిర్వహిస్తున్నారు. ఈ రోజు ఉపన్యాసాలకు, గత చరిత్రను వల్లెవేయడానికి కాకుండా... చేనేతను బతికించడానికి ఉపయోగపడాలి.

మహనీయుల మాట




యజమాని నిశ్చలత్వాన్ని, నిలకడను కోరుకుంటాడు. పూర్తిగా ఒంటరిగా వుండాలనుకుంటాడు. కానీ ఆందోళనకారుడు అలా ఎన్నటికీ కోరుకోడు. కార్మిక సమస్య వెనుక లెక్క కట్టలేనంత శత్రుత్వం దాగి వుంటుంది. కార్మిక ఆందోళనకారులు దీన్ని వెలికి తీసి నగ్నంగా ప్రదర్శించడానికి, ఎండగట్టడానికి, అంతిమంగా ప్రపంచంలో అది లేకుండా చేయడానికీ ప్రయత్నిస్తారు.

- యూజిన్ డెబ్స్,
అమెరికా సోషలిస్టు పార్టీ నాయకుడు.

హర్యానాలో బుస కొట్టిన మతోన్మాదం

ప్రస్తుతం



తెలకపల్లి రవి

మత సామరస్యం, లౌకికతత్వం కాపాడుకోవాలని చాలా కాలంగా ప్రజాస్వామికవాదులు చెబుతున్న మాట ఎంత నిజమో ఆచరణలో అర్థమవుతున్న సందర్భమిది. దేశ పాలకులు ఆ విధమైన సందేశంతో ముందుకు రావడంలేదు సరికదా ఎగదోసేందుకు కారణమవుతున్నారు. గత మూడు మాసాలుగా మణిపూర్‌లో హింసాకాండపై దేశం కలత చెందుతున్నది. ఈశాన్యాన కొండకోనల్లో, మారుమూలల్లో మహిళలపై ఘోర కలి సాగిన తీరు తెలుసుకుని భరతమాత తల్లడిల్లింది. అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహించింది. దేశం సిగ్గుపడాలని ప్రధాని మోడీ పార్లమెంటు భవనం ముందు ప్రవచించారు కూడా. అయితే అత్యున్నత చట్టసభ అయిన పార్లమెంటులో అదే మాట చెప్పడానికి ఒప్పుకోలేదు. ఉభయ సభల్లో ఆ అంశం సమగ్రంగా చర్చించడానికి కేంద్రం సిద్ధపడలేదు. అవిశ్వాస తీర్మానం రూపంలో చర్చ చేద్దామని ప్రతిపక్షాలు కొత్త వ్యూహం చేపట్టాల్సి వచ్చింది. ఈ లోగా దేశ రాజధాని శివార్లలోని కార్పొరేట్ హబ్ గురుగావ్, నుహ్ పట్టణాల్లో మత కలహాలు భగ్గుమన్నాయి. మత సంస్థలు వ్యూహాత్మకంగా పెట్టిన చిచ్చు ఆరు ప్రాణాలు పోవడానికి కారణమైంది. హిందూత్వ శక్తుల కవ్వింపు చర్యలు, వాటిపై అభద్రతతో ముస్లింలు రెచ్చిపోవడం తీవ్ర హింసాకాండకు దారితీసింది. అక్కడ చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునేవారు, పని చేసుకుని పొట్ట పోసుకునే శ్రమజీవులు, వలస ప్రాణులు అకారణంగా బలైపోయారు. మణిపూర్ మంటలు ఢిల్లీ పాలకులను చేరడానికి చాలా సమయం పట్టింది కానీ ఈ విధ్వంసం, దావానలంలా వ్యాపించిన హింస దేశానికే కలవరం కలిగించాయి.

ఈ సమయంలోనే వారణాసి లోని జ్ఞానవాపి మసీదు వాజ్యం తిరగదోడబడింది. ఒకప్పుడు అయోధ్యలో బాబ్రీ మసీదు/రామ జన్మభూమి వివాదం రగిలిన తీరులోనే ఇప్పుడు వారణాసి వివాదం రగులుకుంటుందనే సందేహాలు బలపడుతున్నాయి. ఈ మసీదులో పురావస్తు పరిశోధనలు జరపాలంటూ కింది కోర్టు ఇచ్చిన ఆదేశాలు సుప్రీం కోర్టు దాకా వెళ్లి తిరిగి హైకోర్టుకు వచ్చి అనుమతి పొందాయి. అయితే ఆ అనుమతితో నిమిత్తం లేకుండా యు.పి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దాన్ని మసీదు అననక్కరలేదని ఏకపక్షంగా ప్రకటించేశారు. ఇలాంటి వైఖరి ఆచరణలో మతోన్మాద రాజకీయాలను ఎలా ప్రకోపింపచేస్తుందో చాలాసార్లు చూశాం. అన్నట్టు మధురలోనూ కృష్ణ జన్మస్థాన్ ఇలాంటి మలుపులే తిరుగుతున్నది. వందల సంవత్సరాల కిందటి చరిత్ర పరిణామాలపై ఇలాంటి వివాదాలు పునరావృతం కాకూడదనే పార్లమెంటు 1991 ప్రార్థనా స్థలాల చట్టం ఆమోదించింది. అయోధ్య సమస్యలో సుప్రీం కోర్టు తీర్పును పాటించాలని మిగిలిన అన్ని చోట్ల 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చిన నాటి యథాతథ స్థితి కొనసాగాలి తప్ప కొత్త వివాదాలు అనుమతించరాదని ఈ చట్టం నిర్దేశించింది. కాని స్వయాన సుప్రీం కోర్టు ఇప్పుడా చట్టానికి కొత్త భాష్యం చెప్పి కొత్త తగాదాలకు తలుపు తీసింది. ఈ వివాదాలు, విధ్వంసాలు, విద్వేషాల పర్యవసానాల పట్ల ప్రతి భారతీయుడూ అప్రమత్తంగా వుండాలి. జైపూర్ ఎక్స్‌ప్రెస్‌లో ఒక ఆర్‌పిఎఫ్ జవాన్ నలుగురు ముస్లింలను వెతికి మరీ కాల్చి చంపడం, మతిస్థిమితం లేనివాడని అధికారులు అతన్ని సమర్థించడం కూడా ఇలాంటిదే.



ఈ స్థాయిలో విధ్వంసం జరిగిందంటే దీని వెనక పథకం ప్రకారం జరిగిన కుట్ర వుందని ముఖ్యమంత్రి ఎం.ఎల్ ఖట్టార్ ప్రకటించారు. అదెవరన్నదే ప్రశ్న. నిజానికి ఇలాంటిది జరుగుతుందని ఆందోళనలు వ్యక్తమవుతున్నా అలసత్వంతో అందుకు అవకాశమిచ్చిన ఆయన ప్రభుత్వ పాత్ర ఏమిటి? నిజానికి ప్రభుత్వ వివరణలు ఎక్కువగా హిందూత్వ శక్తులను సంతృప్తిపర్చేందుకు తప్ప బాధిత ముస్లింలకు ఓదార్పుగా లేవు. అల్లర్లు మొదలైనాక కూడా ఉపముఖ్యమంత్రి దుష్యంత్ సింగ్ చౌతాలా తమ అనుమతి లేకుండా ప్రదర్శనలు జరిగినట్టు చెప్పుకొచ్చారు. బిజెపి ఎం.పి రావ్ ఇందర్ సింగ్ మాత్రం ఇటువైపు నుంచి కూడా రెచ్చగొట్టే ప్రయత్నం జరిగిందని కొంతవరకూ అంగీకరించారు.

హర్యానాలో జరిగిందేమిటి?

హర్యానాలో చెలరేగిన మత ఘర్షణలు, విధ్వంస విద్వేషాలు వాస్తవానికి ఢిల్లీలో జరిగినట్టే భావించాలి. ఎందుకంటే గురుగావ్ పారిశ్రామిక కేంద్రం దేశ విదేశీ పెట్టుబడులకు, పెద్ద సంస్థలకు నిలయం. దేశమంతటి నుంచి వచ్చిన సాంకేతిక నిపుణుల నుంచి సామాన్యుల వరకూ అక్కడుంటారు. ఇటీవలే కురిసిన కుంభవృష్టి, వరదల సమయంలో ఈ సంపన్నులు తప్పించుకోగలిగారు గాని మత కలహాల దెబ్బకు తట్టుకోలేకపోయారు. పని చేసుకోవడానికి వలస వచ్చిన అనేక మంది ఇంటిదారి పట్టారు. చిన్నచిన్న వ్యాపారులు దారుణంగా నష్టపోయారు. వారి దుకాణాలు, హోటళ్లు, ఇళ్లు ధ్వంసం కావడం, పూర్తిగా దగ్ధమైపోవడం వారిని కుదిపేసింది. డబుల్ ఇంజన్ సర్కార్ల బిజెపి నేతల నుంచి ఒక్క ఓదార్పు మాటైనా రాకపోగా ఎదురుదాడి చేస్తుండడంతో హతాశులై వారు మరెక్కడికి పోవాలని కలవరపడుతున్నారు. మొత్తం వ్యవహారం చూస్తే ఒక పథకం ప్రకారమే అల్లర్లు సృష్టించినట్టు స్పష్టమవుతుంది. వాస్తవానికి నుహ్ ముస్లిం జనాభా అధికంగా వుండే ప్రాంతం. జులై 31న విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్, ఇతర పరివార్ సంస్థలు రెండు దేవాలయాల మధ్య బ్రజ్ మండల్ యాత్ర నిర్వహిస్తామని ప్రకటించాయి. సంప్రదాయికంగా ఎప్పటినుంచో జరుగుతున్న ఈ ప్రదర్శన ఇటీవలి సంవత్సరాలలో ఉద్రిక్తతలకు ఆలవాలమవుతున్నది. ఎందుకంటే విహెచ్‌పి స్థానికులతో పాటు చుట్టుపక్కల రాష్ట్రాలైన ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్‌ల నుంచి కూడా భారీగా జన సమీకరణ చేసి బల ప్రదర్శనగా మార్చేసింది. పైగా ఈ సారి యాత్రలో బజరంగ్‌దళ్ నాయకుడైన మోనూ మనేసర్ పాల్గొంటాడని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఈ మనేసర్ రాజస్థాన్ లోని భరత్‌పూర్‌లో మొన్న ఫిబ్రవరిలో గోరక్షణ పేరిట నిసార్, జునాయిడ్ అనే ఇద్దరు ముస్లిం యువకుల హత్య కేసులో నిందితుడుగా వున్న వ్యక్తి. దానికి ముందు జిమ్‌లో శిక్షణ నిచ్చే ఆసిఫ్‌ఖాన్, వారిస్ ఖాన్ అనే మెకానిక్ హత్యలో కూడా నిందితుడుగా వున్నాడు. అలాంటి వ్యక్తి పాల్గొంటాడని ప్రకటించడం ముస్లిం యువతలో తీవ్ర నిరసనకు దారితీసింది. వారూ వ్యతిరేకంగా సమీకృతం కావడం ప్రచారం సాగించడానికి దారితీసింది. ముందు నుంచి సోషల్ మీడియాలో ఈ కథనాలు పోటాపోటీగా నడిచాయి. ఈ సారి ప్రదర్శన తీవ్ర హింసాకాండకు దారితీయవచ్చునని ముందు నుంచే పరిశీలకులు అనుమానిస్తూ వచ్చారు. రాజకీయ పార్టీల నాయకులు ఆ మేరకు పోలీసు యంత్రాంగానికి హెచ్చరికలు చేశారు కూడా. అయితేనేం దేశంలో ఇప్పుడున్న వాతావరణం, బిజెపి, ఆరెస్సెస్ రాజకీయ వ్యూహాల కారణంగా వాటిని బేఖాతరు చేశారు. మరీ ముఖ్యంగా చివరి రోజున మరో బజరంగ్‌దళ్ కార్యకర్త రెచ్చగొట్టే భాషలో దారుణమైన వీడియో వైరల్ చేశాడు. తమ రాకను కాచుకోవడానికి నుహ్ ప్రజానీకం సిద్ధంగా వుండాలని సవాళ్లు విసిరాడు.

హత్యలు, విధ్వంసాలు, అరాచకం


ఈ నేపథ్యంలో మొదలైన ప్రదర్శనలో పరివార్ కార్యకర్తలు తీవ్ర భాషలో రెచ్చగొట్టడం ఆశ్చర్యమేమీ కాదు. మనేసర్ రాలేదు గాని బజరంగ్‌దళ్ నాయకుడైన సుందర్ జైన్ హాజరైనారు. నల్వార్ మహదేవ మందిర్‌లో పాల్గొని ఉద్రేకాలు పెంచేలా ప్రసంగించాడు. అంతేగాక వారు తుపాకులు, ఇతర ఆయుధాలు పట్టుకుని ఉద్రిక్తత పెంచారు. ముందే రెచ్చిపోయి వున్న ముస్లిం యువత వారిపై రాళ్లు విసిరారు. దాంతో ప్రదర్శకులు తాము బయలుదేరిన మొదటి గుడి దగ్గరకు వచ్చి తల దాచుకున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు, ప్రభుత్వాధినేతలు పరిస్థితిని ఉపశమింపచేయడానికి చర్యలు తీసుకోలేదు. పక్క జిల్లాల నుంచి అదనపు పోలీసులను రప్పించి వారి రక్షణలో మళ్లీ ప్రదర్శకులను ముందుకు సాగేందుకు అనుమతినిచ్చారు. ఆగస్టు 2న ఈ ప్రదర్శకులు వెళ్లి సెక్టార్ 57లో ఒక మసీదుపై దాడి చేశారు. అక్కడ పాతికేళ్ల వయసున్న ఇమామ్‌ను చంపివేసినట్టు సమాచారం. మోటారు సైకిళ్లపై వచ్చిన దుండగులు దాంతోపాటు మరో మసీదుపై పెట్రోలు బాంబులు విసిరేశారు. దాంతో అవతలివారు మళ్లీ ఎదురుదాడి చేశారు. పరిస్థితి పూర్తిగా అదుపు తప్పిపోయింది. కర్ఫ్యూతో సహా నిషేధాజ్ఞలు విధించాల్సి వచ్చింది. వాహనాల దహనం, విధ్వంసం, అల్లర్లు, అరాచకం తాండవించాయి. ఇక జిల్లా యంత్రాంగమైతే అచేతనంగా వుండిపోయింది. నుహ్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌పై దుండగులు దాడి చేశారు. ఇద్దరు హోం గార్డులు, నలుగురు సాధారణ పౌరులు ప్రాణాలు కోల్పోయారు. గురుగావ్, నుహ్, సోహ్నాలలో 70 మందికి పైగా గాయాలపాలైనారు. కోటానుకోట్ల విలువైన ఆస్తి సర్వనాశనమైంది. వందలాది మంది ప్రాణాలు అర చేత పట్టుకుని ఇళ్లు వదలిపోయారు. ఐటి నిపుణులు కూడా హడలెత్తి స్వస్థలాలకు పయనం కట్టారు. ఒక్కసారిగా గురుగావ్ కల్లోలితమైపోయింది. ఇక్కడున్న బహుళజాతి కంపెనీల ప్రతినిధులు విదేశాల నుంచి ఆందోళన సందేశాలు పంపే పరిస్థితి ఏర్పడింది. ఈ స్థాయిలో విధ్వంసం జరిగిందంటే దీని వెనక పథకం ప్రకారం జరిగిన కుట్ర వుందని ముఖ్యమంత్రి ఎం.ఎల్ ఖట్టార్ ప్రకటించారు. అదెవరన్నదే ప్రశ్న. నిజానికి ఇలాంటిది జరుగుతుందని ఆందోళనలు వ్యక్తమవుతున్నా అలసత్వంతో అందుకు అవకాశమిచ్చిన ఆయన ప్రభుత్వ పాత్ర ఏమిటి? నిజానికి ప్రభుత్వ వివరణలు ఎక్కువగా హిందూత్వ శక్తులను సంతృప్తిపర్చేందుకు తప్ప బాధిత ముస్లింలకు ఓదార్పుగా లేవు. అల్లర్లు మొదలైనాక కూడా ఉపముఖ్యమంత్రి దుష్యంత్ సింగ్ చౌతాలా తమ అనుమతి లేకుండా ప్రదర్శనలు జరిగినట్టు చెప్పుకొచ్చారు. బిజెపి ఎం.పి రావ్ ఇందర్ సింగ్ మాత్రం ఇటువైపు నుంచి కూడా రెచ్చగొట్టే ప్రయత్నం జరిగిందని కొంతవరకూ అంగీకరించారు. మొత్తంపైన పోలీసులు రంగంలోకి దిగి 140 మందిని అరెస్టు చేశారు. వంద వరకూ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.

సోషల్ మీడియా ఆయుధంగా..

నుహ్ హింసాకాండలో ఆందోళన కలిగించే అంశం సోషల్ మీడియా పాత్రే. దాదాపు 2000 వీడియోలు యూట్యూబ్ ద్వారా ప్రసారమై ప్రజలలో భయోత్పాతం, మత విద్వేషం పెంచాయి. ఇరుమతాల వైపు నుంచి వున్నా అధిక భాగం విద్వేషాన్ని పెంచే విధంగా బజరంగ్‌దళ్ సృష్టించినవే. అవతలివారు దాడి చేసినట్టు అమానుషంగా ప్రాణాలు తీసినట్టు పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. నుహ్ జిల్లా పాత పేరు మేవట్. మేవా రూపురేఖలు మార్చేయాలి. ఇది హిందూ హంతకుల కేంద్రంగా వుండొద్దని రెచ్చగొట్టారు. ఇందుకు ప్రతిగా ముస్లిం యువకులు కొందరు కూడా హింసకు పురికొల్పే వీడియోలు, పోస్టులు చేశారు. ఇదంతా వాతావరణాన్ని కలుషితం చేస్తున్నా సామాజిక కార్యకర్తలు హెచ్చరిస్తున్నా అధికార వర్గాలు ప్రేక్షక పాత్ర పోషించాయి. జరగాల్సిన ఘోరాలు జరిగిపోయాక ఇప్పుడు సోషల్ మీడియా వీడియోలు పరిశీలించేందుకు కమిటీని నియమించారు. వారిలో కొందరిపై కేసులు కూడా పెట్టారు. మరికొందరిపై దర్యాప్తు జరుగుతున్నది. చిన్నాభిన్నమైన అక్కడ ప్రజా జీవితం కోలుకోవడానికి చాలా సమయమే పడుతుందనడంలో సందేహం లేదు. ఎన్నికల కోసం మత విభజన పెంచే రాజకీయాలు మరోసారి ఉధృతమయ్యే ప్రమాదాన్ని ఈ ఘటనలు ఇంకోసారి గుర్తు చేస్తున్నాయి. ★

పాలకులకు పట్టని ప్రాథమిక విధులు

కర్తవ్యం



పొత్తూరి సురేష్ కుమార్

'ద్వేష భావజాలం భారత దేశాన్ని మింగేస్తుంది'. మహాత్మా గాంధీ 75వ వర్ధంతి సందర్భంగా ఆయన ముని మనవడు తుషార్ గాంధీ చేసిన వ్యాఖ్య ఇది. ద్వేష భావజాలం భారతదేశంలో ఎందుకు పెరుగుతున్నదో దేశ రాజకీయాలను చూచాయగా పరిశీలించే వారికి సైతం తెలుస్తుంది. ద్వేష భావజాలాన్ని పెంచటంలో, వ్యాప్తి చేయటంలో రాజకీయ నాయకులు, పాలకుల పాత్ర ఎంత వున్నది? రాజ్యాంగం వారికి చెప్పిందేమిటి? వారు చేస్తున్నదేమిటో చర్చించటమే ఈ వ్యాసం ఉద్దేశ్యం. ఈ క్రమంలో ప్రాథమిక విధుల గురించి తెలుసుకోవటం అవసరం.

ప్రాథమిక విధులు - చరిత్ర

రాజ్యాంగం ఆమోదించినపుడు ప్రాథమిక విధులు అందులో భాగం కాదు. నాటి రాజ్యాంగ నిర్మాతలు అప్పుడున్న సామాజిక, నైతిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రాథమిక విధులు అవసరం లేదని భావించి ఉండవచ్చు. కాని 1976లో స్వరణ్ సింగ్ కమిటీ సిఫార్సుల మేరకు 42వ సవరణ ద్వారా వాటిని రాజ్యాంగంలో పొందుపరిచారు.

ప్రాథమిక విధులను ఎందుకు చేర్చారు?

"కాలం గడిచే కొలది నైతిక విలువలు...ముఖ్యంగా ప్రజా జీవితంలో విలువల పతనం స్పష్టమైన కారణంగా ప్రాథమిక విధులను ప్రత్యేకంగా రూపొందించటం అవసరమని దేశం భావించింది." అని జస్టిస్ జె.ఎస్. వర్మ కమిటీ పేర్కొంది.

ప్రాథమిక విధులు - స్వభావం

51ఏ అధికరణంలో మొత్తం 11 ప్రాథమిక విధులుంటాయి. వాటిలో 51(ఎ)(ఇ)లో ఉన్న ప్రాథమిక విధిని మాత్రమే ఈ వ్యాసంలో చర్చించాం. కొన్ని విధులు నైతిక నియమావళిలాగా, మరికొన్ని పౌర నియమావళిలాగా ఉంటాయి.

అధికరణం 51(ఎ)ఇ లో ఏముంది?

ఈ అధికరణంలో రెండు భాగాలున్నాయి. మొదటి భాగం భారత ప్రజలందరి మధ్య కుల, మత, భాషా, ప్రాంత లేదా ఏ ఇతర విభజనలతో వైవిధ్యాలతో వైవిధ్యాలతో సంబంధం లేకుండా ప్రజలందరి మధ్య సామరస్యం, సోదరభావాన్ని పెంపొందించాలని ఆదేశిస్తుంది. రెండవ భాగం స్త్రీలను అగౌరవ పరిచే అన్ని అంశాలను, విధానాలను విడనాడాలని ఆదేశిస్తుంది.

ఎవరు పాటించాలి?

51వ అధికరణం ప్రారంభంలో ఇది ప్రతి పౌరుని యొక్క విధి అనే వాక్యం ఉన్నది. దీని అర్థం..ప్రభుత్వానికి, పాలకులకు, అధికార గణానికి, రాజకీయ నాయకులకు వర్తించదా అనేది ప్రశ్న? ఈ ప్రశ్నకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వర్మ సమాధానం చెప్పారు. ప్రాథమిక విధులపై 1999లో ఆయన నేతృత్వంలో వేసిన కమిటి అనేక సిఫార్సులు చేసింది.

జస్టిస్ జె.యస్.వర్మ సిఫార్సులు

రాజకీయ నాయకులు ఈ విధుల గురించి మాట్లాడేటప్పుడు ఇవి ప్రజలు పాటించవలసినవిగా తమకేమీ సంబంధం లేదు అన్నట్లుగా చెబుతారు. కాని వాస్తవంలో వారే ఈ విధులను పాటించవలసిన బాధ్యత ఉంది. నైతిక విలువల వ్యాప్తిలో ఆదర్శనీయులుగా ఉండే వ్యక్తుల పాత్ర చాలా ప్రముఖమైనది. కేవలం చట్టపరమైన నిబంధనల ద్వారా ఈ విలువల వ్యాప్తి జరగదు. విలువలు పాటించటం ద్వారా ఆదర్శప్రాయులుగా మారటం ద్వారా, సామాజిక ఆంక్షల ద్వారా ఈ విలువలు వ్యాప్తి చెందుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.



రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ అధికారాలున్న ప్రధానమంత్రి, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మొదలైన వారు మత, భాష, ప్రాంత మొదలైన విభజనలకు అతీతంగా సామరస్యాన్ని ఉమ్మడి సోదర భావాన్ని పెంచాలి. దీనిని నిజాయితీగా చేయాలి. సంకుచితంగా ఆలోచిస్తూ ఎన్నికల ప్రయోజనాల కోసం సమాజంలో ఏదో ఒక తరగతికి ప్రాతినిధ్యం వహిస్తూ ఇతర మతాల పట్ల సమాన భావాన్ని కనబరచని వారు ప్రజలకు స్ఫూర్తినివ్వరు. పంచాయితీ నుండి పార్లమెంటు వరకు ఉన్న ప్రజా ప్రతినిధులు ఈ ప్రాథమిక విధులను ఒక బాధ్యతగా ప్రచారం చేయాలి, పాటించాలి.

రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ అధికారాలున్న ప్రధానమంత్రి, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మొదలైన వారు మత, భాష, ప్రాంత మొదలైన విభజనలకు అతీతంగా సామరస్యాన్ని ఉమ్మడి సోదర భావాన్ని పెంచాలి. దీనిని నిజాయితీగా చేయాలి. సంకుచితంగా ఆలోచిస్తూ ఎన్నికల ప్రయోజనాల కోసం సమాజంలో ఏదో ఒక తరగతికి ప్రాతినిధ్యం వహిస్తూ ఇతర మతాల పట్ల సమాన భావాన్ని కనబరచని వారు ప్రజలకు స్ఫూర్తినివ్వరు. పంచాయితీ నుండి పార్లమెంటు వరకు ఉన్న ప్రజా ప్రతినిధులు ఈ ప్రాథమిక విధులను ఒక బాధ్యతగా ప్రచారం చేయాలి, పాటించాలి.

ప్రభుత్వ ఉద్యోగులు, కార్యాలయాలు

ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఉండే అధిపతులు ప్రాథమిక విధులు ఆచరించి, వ్యాప్తి చేయాలనే బాధ్యత కల్గి ఉన్నారు. వారికి ఇది అదనపు విధి. సిబ్బంది అందరి ముందు ప్రతి సంవత్సరం ప్రాథమిక విధులను ఆచరిస్తానని ప్రతిజ్ఞ చేయాలని జస్టిస్ జె.యస్.వర్మ సూచించారు. అవినీతి లేకుండా, ప్రజలకు సన్నిహితంగా ఉంటూ స్నేహపూర్వకమైన విధానంతో విధులు నిర్వర్తించాలని పారదర్శకత చూపాలని సిఫార్సు చేశారు. ప్రతి అధికారికి రెండు రకాలైన బాధ్యతలు (వ్యక్తిగతంగా, అధికారయుతంగానూ) ఉంటాయని ఆ రెండింటి సందర్భంగా కూడా విధులు పాటించాలని ఆయన సూచించారు. ప్రభుత్వ అధికారులు లేదా ప్రభుత్వ కార్యాలయాల మీద ఆధిపత్యం ఉన్న వారు ఎవరైనా... రాజకీయ, పరిపాలనా, విద్య, ఇతర ఏ ప్రజా సేవలకు సంబంధించినదయినా... వారు తమ అధికార పరిధి ఉన్నంతవరకు పౌరులను ప్రాథమిక విధుల విషయంలో మార్గదర్శకంగా నిలుస్తూ ప్రచారం చేయాలి. ప్రతి సంవత్సరం జనవరి మూడవ తేదీని ప్రాథమిక విధుల దినోత్సవంగా పాటించాలి.

పై సిఫార్సులను పరిశీలించినప్పుడు ప్రధానంగా రాజకీయ నాయకులు, ఎన్నికలలో పాల్గొనేవారు, ప్రభుత్వ అధికారులు అత్యంత నిజాయితీగా ఉండాలి. ముఖ్యంగా సోదరభావాన్ని పెంపొందించటంలో ప్రముఖ పాత్ర పోషించాలని అర్థమవుతుంది.

ఆచరణ ఎలా ఉంది?

2014 నుంచి 2018 మధ్య 4 సంవత్సరాల కాలంలో ప్రముఖ రాజకీయ నాయకుల విద్వేష ప్రసంగాలు 5 వందల శాతం పెరిగాయని ఎన్‌డిటివి పరిశోధనలో తేలింది. అలాగే కర్ణాటకలో బిజెపి ప్రభుత్వం 2019 నుండి 2023 ప్రాంతం మధ్యలో 7 ఉత్తర్వులు జారీ చేయడం ద్వారా 182 మత హింస, విద్వేష ప్రసంగాలు, గోరక్షణ నేరాలకు సంబంధించిన కేసులను ఉపసంహరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ఫలితంగా ఈ నేరాలలో నిందితులుగా ఉన్న వందలాది మంది శిక్షల నుంచి బయటపడ్డారు. వీరిలో ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా ఉన్నారు. అంటే వందల మంది రాజకీయ నాయకులు ప్రాథమిక విధులకు విరుద్ధంగా విద్వేష ప్రసంగాలు చేస్తున్నారని అర్థమవుతుంది. అలాగే 2017లో హిందూస్థాన్ టైమ్స్ చేసిన సర్వే ప్రకారం ఎన్నిక కాబడిన, అధికారాలు పొందిన వారిలో 50 మందిపై మత హింస, ద్వేష ప్రసంగాలకు సంబంధించిన నేరాలు నమోదయ్యాయి.

2018-2019 మధ్య కాలంలో అసత్యపు వార్తలను, వాట్సాప్ వార్తలు నిజమని నమ్మి 31 మంది చనిపోయారని బిబిసి పరిశోధనలో తెలిపింది. ఇతర మతాలపై ద్వేషపూరిత, అనుచిత వ్యాఖ్యలు చేశారన్న కారణంగా గల్ఫ్ దేశాలు, ముస్లిం దేశాలు తమ అసమ్మతిని తెలియజేయటం మనం గమనించాం. మణిపూర్, హర్యానా, ఇతర ప్రాంతాలలో జరుగుతున్న హింసాత్మక ఘర్షణలు...ఇటీవలి కాలంలో పెరుగుతున్న విద్వేష ప్రచార ఫలితాలే.

సుప్రీంకోర్టు తీర్పులు

ప్రాథమిక విధులను క్షేత్ర స్థాయి నుంచి ప్రచారం చేయాలన్న జస్టిస్ వర్మ కమిటి సిఫార్సులను వెంటనే అమలు చేయాలని 2003లో జస్టిస్ రంగనాథ్ మిశ్రా పిటిషనర్‌గా భావించబడిన కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. స్కూలు స్థాయి నుంచి అన్ని విద్యా స్థాయిల వరకు సమాజంలోని అన్ని విభాగాలలోను ఈ విధులను ప్రచారం చేయాలని, సోదరభావం, మతాల పట్ల సమభావం పెరిగేందుకు చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. 20 సంవత్సరాలు గడిచిన తర్వాత కూడా ద్వేషభావాన్ని తీవ్రస్థాయికి చేర్చిన రాజకీయ నాయకులు, పాలకులు సమాధానం చెప్పుకోవాలి. ద్వేష ప్రసంగాల విషయంలో వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి తక్షణం చర్యలు తీసుకోవాలని జస్టిస్ కె.ఎం. జోసెఫ్ బెంచ్ ఇటీవల తీర్పునిచ్చింది.

ఈ నేపథ్యంలో ప్రచారం చేయవలసిన, పాటించవలసిన ప్రాథమిక విధులు, నైతిక విలువలను పక్కనబెట్టి మతపరమైన విషయాలను ప్రచారం చేస్తామని, అవగాహన కల్పిస్తామని ఎ.పి మంత్రివర్యులొకరు ప్రకటించటం విపరీతం. ఇప్పటికైనా ప్రభుత్వాలు కళ్లు తెరిచి భారత దేశ సంస్కృతి సాంప్రదాయమైన ...పరమత సహనం, సహోదర భావంతో పాటు ఇతర అన్ని ప్రాథమిక విధులను పాటించి ప్రచారం చేయాలని ఆశిద్దాం.

(వ్యాసకర్త : ఎ.పి.సి.ఎల్.ఎ ప్రధాన కార్యదర్శి, సుప్రీంకోర్టు న్యాయవాది)

సందర్భం



హిరోషిమా డే

రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో 1945 ఆగస్టు 6 ఉదయం అమెరికా ప్రయోగించిన 'లిటిల్ బాయ్' అనబడే 5 టన్నుల అణుబాంబు తాకిడికి జపాన్ లోని పారిశ్రామిక, మిలిటరీ కేంద్రమైన 'హిరోషిమా' నగరం నేలమట్టం కావడం మానవాళి చరిత్రలో చీకటి ఘటన. మూడు రోజుల అనంతరం ఆగస్టు 9న 'నాగసాకి' నగరంపై మరో ఆటమ్ బాంబు వేయడంతో జరిగిన మానవ, ఆస్తి విధ్వంసం అంచనాలకు అందనంత అధికంగా నమోదైంది. ఈ అణుబాంబుల తాకిడికి 3.5 లక్షల అమాయక జపనీయులు మరణించగా, 35,000 పైగా గాయపడ్డారు. 60,000 పైగా క్షతగాత్రులు రేడియేషన్, తీవ్రంగా కాలిన గాయాలతో నరకం అనుభవించారు. హిరోషిమా నగరం దాదాపు 70 శాతం పైగా నేలమట్టం కావడంతో అణుశక్తి తీవ్రత ఎంత ఉంటుందో ప్రపంచానికి అప్పుడు అర్థమైంది. నగరంలోని 90,000 భవనాల్లో దాదాపు 65,000 భవనాలు నేలమట్టం అయ్యాయని తెలుస్తున్నది. నాగసాకి నగరంపై ప్రయోగించిన 'ఫ్యాట్ మ్యాన్' అణుబాంబు విధ్వంసంతో జపాన్ ఓటమిని అంగీకరించడం, 2వ ప్రపంచ యుద్ధం కొద్ది రోజుల్లోనే ముగవడం వెంట వెంటనే జరిగిపోయాయి. ప్రపంచ దేశాలు గెలుపోటములు, ఆధిపత్య ధోరణులను పక్కన పెట్టి శాంతి స్థాపన దిశగా అడుగులు వేయాలని ప్రపంచ మానవాళి కోరుకుంటున్నది.

- డా|| బుర్ర మధుసూదన్ రెడ్డి
సెల్: 9949700037

ముంబయిలో ఇండియా కూటమి మూడో భేటీ

- 31, సెప్టెంబర్ 1 తేదీల్లో సమావేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల్లో బిజెపిని ఓడించేందుకు ఏర్పడిన ప్రతిపక్ష కూటమి ఇండియా మూడో సమావేశానికి ముంబయి ఆతిథ్యం ఇవ్వనుంది. ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశం తమ పార్టీ ఆధ్వర్యాన నిర్వహించనున్నట్లు ఉద్ధవ్ థాకరే సారథ్యంలోని శివసేన నేత, రాజ్యసభ ఎంపి సంజయ్ రౌత్ తెలిపారు. ఈనెల 31 సాయంత్రం సమావేశం ప్రారంభమవుతుందని, సెప్టెంబర్ 1న 10 గంటలకు తిరిగి సమావేశం కొనసాగుతుందని చెప్పారు. మహా వికాస్ అఘాడి కూటమి శనివారం సమావేశమైన అనంతరం మీడియాతో సంజయ్ రౌత్ మాట్లాడుతూ, ముంబయిలో జరిగే సమావేశానికి ఉద్ధవ్ థాకరే ఆతిథ్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రతిపక్ష నేతలతో పాటు ఐదుగురు సిఎంలు ఆగస్టు 31న ఇచ్చే డిన్నర్‌లో పాల్గొంటారని, అనంతరం పాత్రికేయులతో సమావేశం ఉంటుందని తెలిపారు. ముంబయి సమావేశంపై చర్చించేందుకు మహా వికాస్ అఘాడి నేతలంతా శనివారం సమావేశమయ్యారని, సమావేశాల విజయవంతానికి నేతలందరూ ఒక్కో బాధ్యత చొప్పన తీసుకోనున్నారని చెప్పారు.

గుజరాత్ బిజెపిలో అసమ్మతి

- పార్టీ పదవికి ప్రదీప్‌సింగ్ వాఘేలా గుడ్‌బై

అహ్మదాబాద్ : ప్రధాని నరేంద్ర మోడీ ఇలాకాలోనే బిజెపిలో అసమ్మతి స్వరాలు వినిపిస్తున్నాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాటిల్‌పై తిరుగుబాటు చేస్తున్న నాయకులను ఒక్కొక్కరినే బయటికి సాగనంపుతున్నారు. తాజాగా బిజెపి గుజరాత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌సింగ్ వాఘేలా తన పదవికి రాజీనామా చేశారు. ఆయనను రాజీనామా చేయాల్సిందిగా పార్టీ ఆదేశించిందని డెక్కన్ హెరాల్డ్ పత్రిక తెలిపింది. 'పార్టీ పదవికి రాజీనామా చేయాల్సిందిగా వాఘేలాను గత నెలలోనే ఆదేశించారు. గాంధీనగర్‌లోని పార్టీ కార్యాలయానికి రావద్దని కూడా చెప్పారు' అని బిజెపి నాయకుడొకరు ఆ పత్రికకు చెప్పారు. పార్టీ నాయకత్వంతో చర్చించి సమస్యను పరిష్కరించుకోవాలని వాఘేలా ప్రయత్నించినా ఫలించలేదని, దీంతో గత నెల 31న ఆయన రాజీనామా చేశారని ఆ నాయకుడు వివరించారు. వాఘేలా 2016 ఆగస్ట్ 10 నుంచి రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. పార్టీకి చెందిన మరో ప్రధాన కార్యదర్శి భార్గవ్ భట్‌ను కూడా ఇలాగే సాగనంపారు. లంచం తీసుకున్నారంటూ పాటిల్‌పై ఆరోపణలు చేసిన ముగ్గురు కార్యకర్తలను ఇటీవలే సూరత్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు అరెస్ట్ చేశారు.

మణిపూర్‌లో మళ్లీ హింస

- ఉగ్రవాదుల దాడిలో ముగ్గురు మృతి
- ఇంఫాల్ లోయసహా పలు ప్రాంతాల్లో 24 గంటల సమ్మె
- కర్ఫ్యూ సడలింపు వేళల కుదింపు



బిష్ణుపూర్ (మణిపూర్) : మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతూనే ఉంది. శనివారం తెల్లవారుజామున బిష్ణుపూర్ జిల్లాలో ఉగ్రవాదులు జరిపిన దాడుల్లో ముగ్గురు మరణించారని పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మణిపూర్‌లోని బిష్ణుపూర్ జిల్లా క్వాక్తా సమీపంలోని ఉఖా తంపఖ్ గ్రామంలో శనివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో ఉగ్రవాదులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో ఉగ్రవాదులు తండ్రీకొడుకులిద్దరు, మరో వ్యక్తిని దారుణంగా హత్య చేసి చంపారని పోలీసులు శనివారం తెలిపారు. హత్యకు గురైన గ్రామస్తులు నిద్రిస్తున్న సమయంలో ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిపి, కత్తులతో పొడిచి చంపారని పోలీసులు తెలిపారు. దాడి చేసిన ఉగ్రవాదులు చురచంద్‌పూర్ నుండి వచ్చినట్లు పోలీసులు పేర్కొన్నారు. కొండలు, లోయల మధ్య, కేంద్ర భద్రతా బలగాలు నిర్వహించబడుతున్న బఫర్‌జోన్‌ను ఉగ్రవాదులు ఉల్లంఘించి, దాడి చేశారని తెలిపారు. మరణించిన ముగ్గురూ రిలీఫ్ క్యాంపులో ఉండేవారు. పరిస్థితి మెరుగుపడిందని భావించి, శుక్రవారం తమ నివాసాలకు తిరిగి వచ్చారు. అంతలోనే ఈ ఘోరం జరిగిందని పోలీసులు చెప్పారు.

హత్యలకు ప్రతీకారంగా బిష్ణుపూర్ జిల్లా ఉఖా తంపక్‌లో కుకీలకు చెందిన ఇళ్లను ఒక మూక తగలబెట్టినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మరో ఘటనలో రాష్ట్ర బలగాలు, ఉగ్రవాదుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక పోలీసు సహా ముగ్గురు గాయపడ్డారు. వారిని ఇంఫాల్‌లోని రాజ్ మెడిసిటీకి చికిత్స నిమిత్తం తరలించినట్లు పోలీసులు తెలిపారు. బిష్ణుపూర్‌లోని నారస్సీనా ప్రాంతంలోని రెండో భారత రిజర్వు బెటాలియన్ (ఐఆర్‌బి) ప్రధాన కార్యాలయంలోని పోలీసు ఆయుధాగారంపై గురువారం రాత్రి దాడి చేసి భారీగా ఆయుధాలను ఎత్తుకెళ్లారు.

కర్ఫ్యూ వేళల కుదింపు

తాజా ఘటనల నేపథ్యంలో ఇంఫాల్‌లోని రెండు జిల్లాల్లో కర్ఫ్యూ సడలింపు సమయాన్ని ఉదయం 5 నుంచి 10.30 గంటల వరకు కుదించారు. గతంలో ఉదయం 5 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ కర్ఫ్యూ సడలింపు ఉండేది.

ప్రభుత్వ సంస్థలు ఏమి చేస్తున్నాయి : ఐటిఎల్‌ఎఫ్

హింసను అరికట్టేందుకు ప్రభుత్వ సంస్థలు ఏమి చేస్తున్నాయో తెలుసుకోవాలని అనుకుంటున్నామని ఆదివాసీ గిరిజన నాయకుల ఫోరం (ఐటిఎల్‌ఎఫ్) ఒక ప్రకటనలో పేర్కొంది. మూడు నెలలుగా ప్రభుత్వం పంపించిన తుపాకులను, ఆయుధాలను దోచుకుంటున్నా, భద్రతాపరమైన ఉద్రిక్తతలకు పాల్పడుతున్నా ఎందుకు నివారించలేకపోతున్నారని రాష్ట్రప్రభుత్వాన్ని ప్రశ్నించింది.

ఇంఫాల్ లోయ సహా పలు ప్రాంతాల్లో 24 గంటల సమ్మె

27 అసెంబ్లీ నియోజకవర్గాల కో-ఆర్డినేషన్ కమిటీ 24 గంటల సమ్మెకు పిలుపునిచ్చింది. దీంతో, ఇంఫాల్ లోయసహా దాదాపు అన్ని ప్రాంతాల్లో శనివారం దుకాణాలు, వ్యాపార సముదాయాలు మూసివేశారు.



నిధులు జమచేయాలని సర్పంచుల ధర్నా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎపిలో గ్రామ పంచాయతీ నిధులు గ్రామాలకు చేరడం లేదని, నిధులు తమ ఖాతాల్లో జమ చేయాలని సర్పంచులు డిమాండ్ చేశారు. శనివారం నాడిక్కడ జంతర్ మంతర్ వద్ద ధర్నా చేపట్టారు. టిడిపి ఎంపి కనకమేడల రవీంద్ర కుమార్, వైసిపి ఎంపి రఘురామ కృష్ణరాజు సంఘీభావం తెలిపారు. ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వైవిబి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు రాష్ట్ర ప్రభుత్వం,సిఎం జగన్ తమ గ్రామ ప్రజలకు, సర్పంచులకు అందకుండా సైంధవుడిలా అడ్డుపడి దిగమింగేస్తున్నారని విమర్శించారు. ప్రధాని మోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెంటనే జోక్యం చేసుకుని, తమ గ్రామ ప్రజల మనోభావాలను గౌరవించి గ్రామాల అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం నిధులు సర్పంచుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ ఛాంబర్ ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాపరెడ్డి, రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి పగడాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి కేసులో బిజెపి ఎంపీకి రెండేళ్ల జైలు

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని ఇతావా నియోజకవర్గానికి చెందిన బిజెపి ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి రామ్ శంకర్ కటారియా 2011లో ఆగ్రాలోని విద్యుత్ సరఫరా కంపెనీ మేనేజర్‌పై తన అనుచరులతో కలిసి దాడి చేశారు. ఆ కేసుపై ఆగ్రా కోర్టు విచారణ జరిపి, రామ్ శంకర్‌ను దోషిగా నిర్ధారించింది. రెండేళ్ల జైలు శిక్షతోపాటు రూ.50,000 జరిమానా విధిస్తూ శనివారం తీర్పు ఇచ్చింది.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలో వైకల్యాలను ఎందుకు లెక్కించడం లేదు

- కేంద్రానికి కర్ణాటక హైకోర్టు నోటీసులు

బెంగళూరు : జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్)-6లో వైకల్యాలను వేరియబుల్‌గా మినహాయించడాన్ని ప్రశ్నిస్తున్న ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం (పిల్)పై కేంద్ర ప్రభుత్వానికి కర్ణాటక హైకోర్టు నోటీసులు జారీ చేసింది. జావేద్ అబిది ఫౌండేషన్ దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి ప్రసన్న బి.వరలె, జస్టిస్ ఎం.జి.ఎస్.కమల్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఈ మేరకు ఆదేశాలిచ్చింది. వికలాంగుల హక్కుల చట్టం (ఆర్‌పిడబ్ల్యుడి), 2016 షెడ్యూల్‌లో ప్రస్తావించిన 21 వైకల్యాలను ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్-6 కుటుంబాల ప్రశ్నావళిలో వేరియబుల్‌గా చేర్చాలని పిటిషనర్ కోరారు. ఈ మేరకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖకు ఆదేశాలు ఇవ్వాల్సిందిగా కోర్టును కోరారు. ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్-5లో వైకల్యాలు అనేది ఒక వేరియబుల్‌గా వుందని గుర్తు చేశారు.

సహేతుకంగా లేని కారణాలు

వైకల్యాన్ని గురించి ప్రశ్నించి, దాన్ని అంచనా వేసేంత నైపుణ్యం లేదా శిక్షణ ఎన్యూమరేటర్లకు వుండదని, పైగా వైకల్యాన్ని ఒక వేరియబుల్‌గా పెట్టడం వల్ల కాల హరణం, అత్యంత సంక్లిష్ట క్రమమని కారణాలుగా పేర్కొంటూ సాంకేతిక సలహా కమిటీ ఇచ్చిన సలహాపై ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్-6 నుంచి వైకల్యాన్ని తొలగించినట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వివిధ మీడియా వార్తలను అందులో ఉటంకించారు. వికలాంగుల హక్కులపై ఐక్యరాజ్య సమితి ఒప్పందం (యుఎన్‌సిఆర్‌పిడి) లో 31వ అధికరణ నేపథ్యంలో అసలు ఈ కారణాలు ఏ మాత్రమూ సమర్ధనీయం కాదని పిటిషనర్ పేర్కొన్నారు. పైగా 2018లోని నేషనల్ శాంపిల్ సర్వే 76వ రౌండ్‌లో వైకల్యంపై గణన జరిగిందని, ఆ అంకెల్లో మార్పు వుండబోదని మంత్రిత్వ శాఖ చెప్పడంతో కూడా పిటిషనర్ విభేదించారు.

లోక్‌సభ సెక్రటేరియట్‌కు సుప్రీం తీర్పు కాపీ

- సభ్యత్వం రద్దు చేసినప్పుడు ఉన్న స్పీడ్ ఇప్పుడేమైంది? : కాంగ్రెస్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పరువు నష్టం కేసులో సూరత్ కోర్టు కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీకి విధించిన శిక్షపై స్టే విధించిన సుప్రీంకోర్టు తీర్పు కాపీని అధికారికంగా లోక్‌సభ సెక్రటేరియట్‌కు కాంగ్రెస్ అందజేసింది. ఈ మేరకు శనివారం ఆ పార్టీ లోక్‌సభ పక్షనేత అధిర్ రంజన్ చౌదరి అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని పునరుద్ధరించే విషయంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చేస్తున్న జాప్యాన్ని ఆయన తప్పు పట్టారు. రాహుల్ సభ్యత్వాన్ని రద్దు చేసినప్పుడు చూపించిన స్పీడు.. సభ్యత్వం పునరుద్ధరించే విషయంలో ఎందుకు చూపించడం లేదని ప్రశ్నించారు.

ఆపద్ధర్మ ప్రధాని ఎంపికపై పాక్ సంకీర్ణం మల్లగుల్లాలు

- గడువుకు మూడు రోజుల ముందు పార్లమెంటు రద్దు

ఇస్లామాబాద్ : ఈనెల9న పాక్ నేషనల్ అసెంబ్లీ (పార్లమెంటు)ని రద్దు చేస్తామంటూ ప్రధాని ప్రకటించిన దరిమిలా ఆపద్ధర్మ ప్రధానిగా ఎవరు వుంటారనే అంశంపై పాలక సంకీర్ణం మల్లగుల్లాలు పడుతోంది. అందరికీ ఆమోదయోగ్యమైన వ్యక్తిని ఆపద్ధర్మ ప్రధానిగా నియమించేందుకు సంకీర్ణంలోని 8 మిత్రపక్షాలు చర్చలు ఆరంభించాయి. పార్లమెంట్, రాష్ట్రాల అసెంబ్లీలు రద్దు, ఆపద్ధర్మ ప్రధాని ఎంపిక, 2023 జనాభా లెక్కల ప్రాతిపదికన ఎన్నికలు ఈ మూడు అంశాలే ఎజెండాగా శుక్రవారం ప్రధాని షెహబాజ్ మిత్రపక్షాలతో సమావేశమయ్యారు. ఆపద్ధర్మ ప్రధాని పదవికి పేర్లు సూచించడానికి తమకు కొంత సమయం కావాలని కొన్ని పార్టీలు కోరాయి. 9వ తేదీన పార్లమెంట్ రద్దుకు అంగీకరించాయి.

గోంజాల్వెజ్, ఫెరీరా విడుదల

- ఎల్గార్ పరిషద్ కేసులో మొత్తంగా బయటకు ఐదుగురు

ముంబయి : ఎల్గార పరిషద్ కేసులో బెయిల్ మంజూరైన తొమ్మిది రోజుల తర్వాత సామాజిక కార్యకర్తలు, లాయర్లు అయిన వెర్నాన్ గోంజాల్వెజ్, అరుణ్ ఫెరీరా శనివారం నవీ ముంబయిలోని తలోజా జైలు నుండి బయటకు వచ్చారు. యుఎపిఎ కింద నమోదైన నేరాల్లో వీరికి ప్రమేయం వుందన్న అభియోగాలపై 2018 ఆగస్టు నుంచి వీరు జైల్లో వున్నారు. జులై 28నే సుప్రీం కోర్టు వీరికి బెయిల్ మంజూరు చేసింది. ఏ తీవ్రవాద చర్యలోనూ గోంజాల్వెజ్, ఫెరీరాలకు ప్రమేయం వున్నట్లు సాక్ష్యాధారాలు లేవంటూ బెయిల్ ఇచ్చింది. ముంబయిలోని ప్రత్యేక కోర్టు వారి విడుదలకు అదనపు షరతులు పెట్టింది. ఇరువురు విడివిడిగా పూచీకత్తులు సమర్పించాలని కోరింది. దాంతో జాప్యం జరిగింది. బెయిల్ షరతులను ఉల్లంఘించినట్టైతే బెయిల్ రద్దు చేసే స్వేచ్ఛ జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్‌ఐఎకి వుంటుందని సుప్రీం పేర్కొంది. శుక్రవారం వీరి విడుదలకు ఎన్‌ఐఎ ఆదేశాలు జారీ చేయడంతో వారు బయటకు వచ్చారు. తాజాగా వీరి విడుదలతో ఇప్పటివరకు ఈ కేసులోని మొత్తం 16మంది నిందితుల్లో ఐదుగురు బెయిల్‌పై బయటకు వచ్చారు. నిందితుల్లో ఒకరైన ఫాదర్ స్టాన్ స్వామి జ్యుడీషియల్ కస్టడీలో వుండగానే చనిపోయారు. ఆయన పట్ల జైలు అధికారులు అమానవీయంగా ప్రవర్తించడం చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే.

నూహ్‌లో మూడోరోజూ కూల్చివేతలు

- అమాయకులపై వేధింపులు ఆపండి : సిపిఎం డిమాండ్


నుహ్‌లో పర్యటించిన సిపిఎం బృందం

ఛండీగఢ్: హర్యానాలోని నూహ్ జిల్లాలో ఇటీవల మత హింసకు కారణమంటూ పలు దుకాణాలను, నివాసాలను మూడోరోజైన శనివారం కూడా రాష్ట్రప్రభుత్వం కూల్చి వేసింది. అల్లర్లకు దెబ్బతిన్న నుహ్ నుంచి 20 కిలోమీటర్ల దూరంలోని తావ్‌డూ పట్టణంలో శుక్రవారం 250 గుడిసెలను అధికారులు తొలగించిన సంగతి తెలిసిందే. ఇళ్ల, గుడిసెల్లో అక్రమ వలసదారులు చట్టవిరుద్ధంగా ఉంటున్నారని, గత నెల 31న జరిగిన అల్లర్లలో వాళ్లే పాల్గొన్నారని అధికారులు చెబుతున్నారు. హర్యానా సిఎం మనోహర్ లాల్ ఖట్టర్ ఆదేశాల మేరకు ఈ కూల్చివేత చేపట్టినట్లు నుహ్ ఎస్‌డిఎం అశ్విని కుమార్ తెలిపారు. శనివారం ఉదయం నల్హార్ ప్రాంతంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ వద్ద ఉన్న ఆసుపత్రి వద్ద ఉన్న సుమారు 60 మెడికల్ షాపులు, ఇతర దుకాణాలను అధికారులు బుల్డోజర్లతో కూల్చివేశారు.

నుహ్‌లో పర్యటించిన సిపిఎం బృందం

అసలైన నిందితులను అరెస్ట్ చేయాలని, అమాయకులపై వేధింపులు నిలిపివేయాలని సిపిఎం ప్రతినిధి బృందం డిమాండ్ చేసింది. పార్టీ హర్యానా ప్రతినిధి బృందం నుహ్‌లోని హింస ప్రభావిత ప్రాంతాలను సందర్శించింది. ప్రజలపై దాడులను నిలిపివేయాలని, సరైన పునరావాసం కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం, జిల్లా పరిపాలనా యంత్రాంగాన్ని కోరింది. ప్రతినిధి బృందంలో జై భగవాన్, వినోద్ కుమార్, అక్తర్ హుస్సేన్ తదితరులు ఉన్నారు. వీరు రోస్కమెవ్, ఘసెడ, నోహ్, నలడ్ గ్రామం, మెడికల్ కాలేజీని సందర్శించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అఫ్తాబ్ అహ్మద్, బార్ అసోసియేషన్ నోహ్ ఆఫీస్ బేరర్లు, మేధావులు, ప్రముఖులను ప్రతినిధి బృందం కలిసింది. ఈ సందర్భంగా ప్రతినిధి బృందం సభ్యులు మాట్లాడుతూ ఘటన నెపంతో వందలాది మంది యువకులను పోలీసులు గుడ్డిగా అరెస్ట్ చేస్తున్నారని విమర్శించింది. సామాన్యుల ఇళ్లపై, షాపులపై, వ్యాపారాలపై బుల్డోజర్లు నడుపుతూ కూల్చేస్తున్నారని విమర్శించారు. ఏళ్ల తరబడి నివాసముంటున్న పేద కార్మికుల కాలనీలు ధ్వంసం చేస్తున్నారని, శనివారం నల్హాద్ కాలేజ్ ముందు 50కి పైగా షాపులు కూల్చేశారని చెప్పారు. కోట్ల రూపాయల ఆస్తి, వస్తువులు ధ్వంసం అయ్యాయన్నారు. నోహ్‌లో అంతా కలసిమెలసి ఉంటున్నా కర్ఫ్యూ కొనసాగిస్తున్నారని విమర్శించారు. రేషన్ సరఫరా నిలిచిపోవడం, సరుకుల ధరలు పెరిగిపోవడంతో కార్మికులు ఆకలితో అలమటిస్తున్నారని తెలిపారు. సాధారణ పరిస్థితిని వెంటనే పునరుద్ధరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

370వ అధికరణ రద్దుకు నాలుగేళ్లు!

(మొదటి పేజీ తరువాయి)

అభద్రతాభావాన్ని మరింతగా పెంచింది. జమ్మూ కాశ్మీర్ అభివృద్ధికి పాటుపడడానికి బదులు ఆర్థిక వ్యవస్థకు చిల్లులు పెట్టే పనులే కేంద్రం ఎక్కువగా చేస్తున్నది. ప్రజల మధ్య మతం పేరుతో చీలిక తెచ్చి తన సంకుచిత రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకోవడమే బిజెపి లక్ష్యంగా ఉంది. కొత్త ఉపాధి అవకాశాలు సృష్టించే బదులు రోజువారీ కూలీలు, సాధారణ కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు ఉపాధి కోల్పోయి వీధిన పడేలా చేసింది. ఉపాధికి సంబంధించి వివక్షా పూరిత నిబంధనలు, నిరంకుశంగా ఉద్యోగుల తొలగింపు వంటి చర్యల ద్వారా ఉద్యోగుల్లో ఓ రకమైన భయానక వాతావరణం నెలకొంది. రెండేళ్ల క్రితం ప్రధాని నరేంద్ర మోడీ ఢిల్లీలో జమ్మూ కాశ్మీర్ నేతలతో భేటీ సందర్భంగా 'ఢిల్లీకి దూర్, దిల్‌కి దూర్' నినాదం ఇచ్చారు. ఈ ప్రాంతంలో కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవడానికి ఇంతవరకు ఎలాంటి ఉపశమన చర్యలు చేపట్టలేదు. ఆగస్టు 5, 2019కి ముందు ఉన్న రాష్ట్ర ప్రతిపత్తిని తప్పనిసరిగా పునరుద్ధరించాలని, క్రూరమైన చట్టాలను విచక్షణా రహితంగా ఉపయోగించడాన్ని మానుకోవాలని జమ్ము కాశ్మీర్‌లోని బిజెపి యేతర రాజకీయ పార్టీలతో కూడిన పీపుల్స్ అలయెన్స్ ఫర్ గుప్కార్ డిక్లరేషన్ (పిఎజిడి) చేసిన డిమాండ్‌ను సైతం మోడీ ప్రభుత్వం పెడచెవిన పెట్టింది.

గృహ నిర్బంధం చేశారు.. బలప్రయోగానికి దిగారు : మెహబూబా ముఫ్తీ

తనను గృహ నిర్బంధం చేశారంటూ మాజీ ముఖ్యమంత్రి, పిడిపి అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ ఎక్స్ (పూర్వపు ట్విట్టర్)లో పోస్టు పెట్టారు. తనను హౌస్ అరెస్ట్ చేశారని, తన పార్టీ సీనియర్ నేతలుసహా పలువురిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్లలో ఉంచారని తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి అణచివేత చర్యలకు దిగి తమ పార్టీ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేశారని విమర్శించారు. ఇక్కడ సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని కేంద్రప్రభుత్వం సుప్రీంకోర్టుకు అసత్యాలు చెబుతోందని, అని అన్నారు. 370వ అధికరణ రద్దు ఉత్సవాలు జరుపుకోవాలంటూ శ్రీనగర్ అంతటా పెద్ద పెద్ద హోర్డింగ్‌లు పెట్టారని ఆమె విమర్శించారు. మరోపక్క ప్రజల మనోభావాలను, వారి నమ్మకాలను దెబ్బతీసేలా దారుణంగా బల ప్రయోగాలకు దిగుతున్నారని అన్నారు. ఆర్టికల్ 370 రద్దు చేసి నాలుగేళ్లయిన సందర్భంగా కార్యక్రమం నిర్వహణ కోసం అనుమతి కోరగా, అధికారులు నిరాకరించారని తెలిపారు. గృహ నిర్బంధానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. 370వ అధికరణ రద్దు అంశం విచారణకు వచ్చినప్పుడు ఈ పరిణామాలన్నింటినీ సుప్రీం కోర్టు పరిగణనలోకి తీసుకోవాలని ఆమె కోరారు.

ఎన్‌సి కార్యాలయానికి సీలు

శ్రీనగర్‌లోని తమ పార్టీ కార్యాలయానికి సీలు వేశారని నేషనల్ కాన్ఫరెన్స్ ప్రతినిధి ఇమ్రాన్ నబి దర్ తెలిపారు. ఎవరినీ లోపలకు వెళ్లనివ్వడం లేదని, బయటకు రానివ్వడం లేదని చెప్పారు. ప్రభుత్వం ఈ విషయంలో ఎంత కలవరపడుతోందో ఈ చర్యలు తెలియజేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. గత నాలుగేళ్లలో గొప్ప పురోగతి సాధించామని బూటకపు వాదనలు చేస్తున్నారని విమర్శించారు.

విషాదకరమైన రోజు : సజాద్ లోనె

జమ్ము కాశ్మీర్ పీపుల్స్ కాన్ఫరెన్స్ ఛైర్మన్ సజాద్ లోనె మాట్లాడుతూ, ఆగస్టు 5 విషాదకరమైన రోజని వ్యాఖ్యానించారు. జమ్ము కాశ్మీర్ ప్రజలకు సాధికారత లేకుండా చేసిన దుర్దినమని అన్నారు. సంస్థలను, వ్యక్తులను, ప్రజలను కించపరిచే క్రమం ఇంకా కొనసాగుతూనే వుందన్నారు. 'భయాన్ని అంగీకారంగా పొరపడవద్దు' అని లోనె వ్యాఖ్యానించారు. ఇదిలావుండగా, ఈ సందర్భంగా దుకాణాలు మూసివేయడానికి అనుమతించబోమని నగరంలోని పలు ప్రాంతాల్లో దుకాణదారుల వద్దకు వెళ్లిన భద్రతా సంస్థలు స్పష్టం చేశాయి.

ప్రజలు శాంతియుతంగా జీవిస్తున్నారు : లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా

గవర్నర్ సిన్హా మాట్లాడుతూ, జమ్ము కాశ్మీర్‌లోని పౌరులందరూ ఇప్పుడు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, శాంతియుత వాతావరణంలో జీవిస్తున్నారని చెప్పారు. "వీధి నిరసనలు, పాఠశాలల మూసివేత, ఏడాదిలో 150 రోజులే కాలేజీలు పనిచేయడం, రాళ్లు విసరడం, వేర్పాటువాదం ఇవన్నీ ముగిసిపోయాయి. ఈనాడు, యువత రాత్రుళ్లు ఆలస్యంగా ఇళ్లకు వెళ్తున్నారు. గిటార్ పట్టుకుని నది ఒడ్డున కూర్చుని కాలం గడుపుతున్నారు" అని పేర్కొన్నారు. కింది స్థాయిలో చాలా పెద్ద మార్పు కనిపిస్తోందని గవర్నర్ తెలిపారు. పాకిస్తాన్ మద్దతుతో కూడిన ప్రచారం విఫలమైందని పేర్కొన్నారు.



ఇమ్రాన్ అరెస్టు

ఇస్లామాబాద్ : పాక్ మాజీ ప్రధాని, పిటిఐ ఛైర్మన్ ఇమ్రాన్ ఖాన్‌ను ప్రభుత్వ బహుమతులు అక్రమంగా అమ్ముకున్నారనే కేసు (దీనినే తోషఖానా కేసు అంటారు)లో పోలీసులు అరెస్టు చేశారు. దీంతో త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో పాల్గొనకుండా ఆయనపై అనర్హత వేటు పడే అవకాశముంది. సెషన్స్ కోర్టు తీర్పుపై ఆయన అప్పీలు చేసుకోవచ్చు. నవంబరులో జరిగే పాక్ పార్లమెంటు ఎన్నికల్లో ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ తనకు ప్రధాన ప్రత్యర్థిగా ఇమ్రాన్‌ను లేకుండా చేసేందుకు తోడ్పడేలా ఇస్లామాబాద్ జిల్లా కోర్టు తీర్పు ఉందని న్యాయ నిపుణులు వ్యాఖ్యానించారు. ఇమ్రాన్‌ఖాన్ అరెస్టు అయిన వెంటనే ఆయన తరపు న్యాయవాది ఇంతెజా పంజోతా రాయిటర్స్‌తో మాట్లాడుతూ, ఈ తీర్పును హైకోర్టులో సవాల్ చేస్తామని చెప్పారు. ఈ అరెస్టు పిటిఐని రాజకీయంగా బలహీనపరిచేందుకు జరుగుతున్న దాడుల్లో తాజా చర్యగా పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇమ్రాన్ అటు అమెరికా, ఇటు సైన్యం ఆధిపత్యాన్ని వ్యతిరేకించినప్పటి నుంచి ఆయనను రాజకీయంగా అణగదొక్కే కుతంత్రాలు జోరందుకున్నాయి. ఆయనకు సన్నిహితులుగా వున్నవారిని దూరం చేశారు. పార్టీని చీల్చారు. ఇప్పుడు ఇమ్రాన్‌ను ఏకంగా జైలుకు పంపారు. ఎన్నికల్లో అనర్హత వేటు పడేలా చేశారు.

వితంతువుల ఆలయ ప్రవేశం నిరాకరణపై హైకోర్టు సీరియస్

చెన్నై: వితంతువులను ఆలయంలోకి ప్రవేశించకుండా నిరోధించడం వంటివి చట్టాల ద్వారా పరిపాలించబడే ఈ నాగరిక సమాజంలో జరగకూడదని మద్రాస్ హైకోర్టు పేర్కొంది. స్త్రీకి తనకంటూ ఒక గుర్తింపు ఉందని స్పష్టం చేసింది. తంగమణి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారిస్తూ జస్టిస్ ఎన్ ఆనంద్ వెంకటేష్ ఆగస్టు 4 నాటి తన ఉత్తర్వుల్లో ఈ వ్యాఖ్యలు చేశారు. ఆగస్టు 9, 10 తేదీల్లో ఈరోడ్ జిల్లాలోని క్తేసేవియూర్ పోస్ట్ కలైమగల్ స్ట్రీట్‌లో ఉన్న పెరియా కారుపరాయణ్ ఆలయంలో జరిగే ఉత్సవాల్లో పిటిషనర్‌తోపాటు అతని కుమారుడు కూడా పాల్గొనేలా పోలీసులు చూడాలని ఆదేశించింది.



చిన్నారి

మూఢ నమ్మకం




రంగనాథం ఒక వ్యాపారి. ఓ రోజు తనకు నమ్మకమైన మిత్రుడు ఫోను చేసి, తక్కువ ధరకే కర్పూరం సరుకు వస్తోందని, వచ్చేది పండగ కాలం కాబట్టి రేటు బాగా పెరిగి వ్యాపారం బాగా అవుతుందని చెప్పాడు. మిత్రుడి మాటలను నమ్మిన రంగనాథం ఒకేసారి పది లారీల కర్పూరం తెప్పించాడు. అయితే రేటు పెరగకపోగా బాగా తగ్గిపోయింది. ఆ సరుకును ఎలాగైనా సొమ్ము చేసుకోవాలని ఓ ఉపాయం ఆలోచించాడు. అది ఫలించి అనుకున్న గడువుకంటే ముందుగానే కర్పూరం అమ్ముడైపోయింది.

ఒకరోజు రంగనాథం భార్య 'ఏమండోయ్ రేపు శుక్రవారం ఉదయాన్నే కర్పూరం దిష్టి తీసిందాక బయటకు వెళ్లకండి. అలా వెళితే మగవాళ్ళకు ప్రమాదమట' అంది. అది విన్న రంగనాథం, పక్కున నవ్వి, పిచ్చిదానా, నా మిత్రుడి మాట నమ్మి, రేటు పెరుగుతుందని, పది లారీల కర్పూరం కొని మన గోదాములలో దాచాను, రేటు పెరగ లేదు, సరికదా తగ్గింది, అందుకే శుక్రవారం కర్పూరంతో దిష్టి తీయకపోతే భర్తలకు ప్రాణగండం అని పుకారు పుట్టించా. ఇంకేముంది గోదాములో దాచిన కర్పూరం అంతా రెట్టింపు రేటుకు అమ్ముడు పోయింది.

'అమ్మవారు కళ్లు తెరిచింది', 'గణపతి పాలు తాగుతున్నాడు' అంటే పరుగులు తీసే జనం బలహీనతను, మాలాంటి వ్యాపారులు ఇలా సొమ్ము చేసుకోవడం చాలాకాలం నుండి జరుగుతున్నదే. మట్టితో చేసిన విగ్రహం నీటిని పీల్చుకుంటుందన్న ప్రకృతి సహజమైన ప్రక్రియకు మూఢనమ్మకం ఆపాదిస్తే జనం పిచ్చివాళ్లవుతున్నంత కాలం మాలాంటి వాళ్ల వ్యాపారాలకు ఏమాత్రం ఢోకాలేదు' అని చెప్పాడు. వ్యాపారి తన వస్తువులు అమ్ముకునేందుకు సవాలక్ష చెబుతాడు.. ఏది మంచో.. చెడో ప్రజలే ఆలోచించాలి' అంటున్న రంగనాథం వంక అయోమయంగా చూస్తూ అతని భార్య లోపలికి వెళ్లింది.

- డా. బెల్లంకొండ నాగేశ్వరరావు.




సరిచేసి రాయండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన బొమ్మ చుట్టూ ఉన్న అక్షరాలను సరైన క్రమంలో రాస్తే ఆ బొమ్మ పేరు వస్తుంది. ట్రై చేయండి.

నేను గీసిన బొమ్మ



బి.చైతన్య,
6వ తరగతి,
కేంద్రీయ విద్యాలయం,
విశాఖపట్నం



ప్రభుత్వాల దగా

- రేపు జంతర్‌మంతర్‌లో పోలవరం నిర్వాసితుల ధర్నా
- బిజెపి రోడ్‌మ్యాప్ ఆధారంగా మూడు పార్టీలు
- విలేకరుల సమావేశంలో వి. శ్రీనివాసరావు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పోలవరం నిర్వాసితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం దేశ రాజధాని ఢిల్లీ నగరంలో సోమవారం భారీ ధర్నా జరగనున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్‌తో కలిసి వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ధర్నాను సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రారంభిస్తారని తెలిపారు. వివిధ ప్రతిపక్ష పార్టీల నేతలు కూడా మద్దతు ఇస్తారన్నారు. అనంతరం రాష్ట్రపతితో పాటు కేంద్ర మంత్రులను కూడా కలిసి వినతిపత్రాలు అందచేస్తామన్నారు. నిర్వాసితులందరికీ తక్షణమే పునరావాసం కల్పించాలని, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ముంపు బాధిత ప్రజానీకానికి న్యాయం చేయాలని కోరుతూ సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 400 కిలోమీటర్ల పాదయాత్ర 15 రోజుల పాటు పాదయాత్ర చేసిన విషయాన్ని ఆయన వివరించారు. ఇటీవల వరదలు వచ్చినప్పుడు ప్రతి ఒక్కరికి రూ.2 వేలు ఇస్తామని చెప్పి బలవంతంగా ఇళ్లకు పంపించేశారని, కానీ ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు.

ఎనిమిది మండలాలకు ముప్పు

పోలవరం ప్రాజెక్టు పూర్తి అయితే ముంపు పరిస్థితి తీవ్రంగా ఉందని వి. శ్రీనివాసరావు తెలిపారు. ప్రాజెక్టు పూర్తయితే ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని ఎనిమిది మండలాలు పూర్తిగా మునిగిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటి వరకు వారికి నష్టపరిహారం ఇవ్వలేదని, పునరావాసం ఊసే లేదని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాస్తవాలను గుర్తించకుండా ప్రజలను మభ్య పెట్టి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు, చిత్రంలో బి వెంకట్

మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. 'మొత్తం 374 గ్రామాలు మునిగిపోతుంటే, రాష్ట్ర ప్రభుత్వం కేవలం 20 గ్రామాలనే పేర్కొంది. అయితే ప్రజల నుంచి తీవ్రమైన ప్రతిఘటన తర్వాత లైడార్ సర్వే చేసి మరో 36 గ్రామాలను చేర్చారు. గతేడాది జూలైలో వచ్చిన వరదలతో 194 గ్రామాలు వరద నీటిలో మునిగిపోయాయి. గతేడాది కంటే ఈ ఏడాది తక్కువ స్థాయిలోనే వరదలు వచ్చాయి. ఈ వరదలకు కూడా అనేక మునిగిపోయిన గ్రామాల్లోకి నీళ్లు వచ్చాయి. ఇవి సాధారణంగా వచ్చే గోదావరి వరదలు కావు. పోలవరం బ్యాక్ వాటర్ వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది.' అని వివరించారు. నిర్వాసితులందరిని ఆదుకోవడానికి బదులుగా రాష్ట్ర ప్రభుత్వం ముంపు గ్రామాల సంఖ్యను కుదించడానికి యోచిస్తోందని, పునరావాసానికి నిధులు సమకూర్చాల్సిన కేంద్ర ప్రభుత్వం ఆ విషయాన్ని పట్టించుకోకుండా వివక్షపూరితంగా, అన్యాయంగా వ్యవహరిస్తోందన్నారు. పునరావాసానికి రూ.35 వేల కోట్లు అవసరమైతే, ఇప్పటి వరకు కేవలం రూ.7 వేల కోట్లు మాత్రమే ఇచ్చారని పేర్కొన్నారు. మొత్తం గ్రామాలను ముంపు గ్రామాలుగా పరిగణించి, అందరికీ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఒకేసారి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. పోలవరం ఎప్పటికి పుర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొందని, వేల కోట్లు ఖర్చు చేసి నిర్మించిన డయాఫ్రం వాల్, కాపర్ డ్యాం, స్పిల్‌వే వంటివి ప్రమాదంలో పడ్డాయని అన్నారు. ఈ పరిస్థితుల్లో లక్షలాది మంది ముంపు గ్రామాల ప్రజలు, ఆదివాసుల జీవితాలు గాలిలో దీపంలా మారాయన్నారు. పోలవరం డిజైన్‌లోనే లోపం ఉందని తాము తొలినుంచి చెబుతున్నామని, ప్రపంచ స్థాయి నిపుణులతో పరిశీలన చేయించి, వారి సూచనల మేరకు వ్యవహరించాలని కోరారు. అంతేతప్ప కాంట్రాక్టర్ల మీదే మొత్తం ప్రాజెక్టు పెట్టకూడదని అన్నారు. అలా పెట్టడం వల్లనే ఇప్పుడు ఇంత నష్టం వచ్చిందని తెలిపారు. వేల కోట్లు వృథా అవుతుందని, దీనికి కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పుంగనూరు ఘర్షణలపై ఆందోళన

చిత్తూరు జిల్లా పుంగనూరులో జరిగిన ఘటనల పట్ల సిపిఎం ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు శ్రీనివాసరావ తెలిపారు. 'అధికార వైసిపి ఎంతో సంయమనంతో వ్యవహరించాల్సి ఉంది. ఈ ఘర్షణలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి. రెచ్చగొట్టే ఘర్షణలు సృష్టించి, వారే శాంతి భద్రతలకు విఘాతానికి కారణం అయ్యారు. పోలీసులు కూడా పక్షపాతంగా వ్యవహరించడం, దాడులు చేయడం దారుణం' అని అన్నారు. వైసిపి, టిడిపి పరస్పర దాడులు రాష్ట్రంలో భయకంపిత వాతావరణానికి కారణం అవుతోందన్నారు. ఈ పరిస్థితిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ' ప్రతిపక్షాలు చిన్న ధర్నా చేస్తే ఇళ్లకొచ్చి అరెస్టులు చేస్తున్నారు. చిత్తూరు జిల్లా బంద్‌కు పిలుపు ఇచ్చిన వైసిపి నేతలను అరెస్టు చేస్తారా?' అని ప్రశ్నించారు. జరిగిన ఘటనపై విచారణ జరిపి నిందితులపై చర్యలు తీసుకోవాలి. అంతేతప్ప పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహించాలి. శాంతి భద్రతలు కాపాడాలి" అని అన్నారు.

బిజెపి చెప్పినటట్టు నడుచుకుంటున్న మూడు పార్టీలు

"ఏపి రాజకీయ పరిస్థితి అనిశ్చితగా ఉందని ఆయన చెప్పారు. దేశంలో ఆంధ్రప్రదేశ్‌లోనే బిజెపి అత్యంత బలహీనంగా ఉందని, అయితే, రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బిజెపి వెంటే ఉన్నాయని చెప్పారు. బిజెపి రోడ్ మ్యాప్ ఆధారంగానే ఈ మూడు పార్టీలు నడుస్తున్నాయన్నారు. 'ప్రత్యేక హెూదా, నిధులు ఇవ్వకుండా, విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం చేస్తున్న బిజెపికి, ఈ పార్టీలు ఎలా మద్దతు ఇస్తున్నాయి?' అని ప్రశ్నించారు. 'ఏపి ప్రజలు బిజెపికి వ్యతిరేకంగా ఉన్నారు. ఈ పార్టీలు ప్రజల మనోభావాలకు భిన్నంగా ద్రోహం చేసి వెన్ను పోటు పొడిచిన బిజెపికి మద్దతు ఇస్తున్నాయి. బిజెపి శాసిస్తే, ఈ పార్టీలు అనుసరిస్తున్నాయి" అని అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తుంటే ఎవ్వరూ మాట్లాడటం లేదన్నార. కేంద్రంలో బిజెపి మద్దతు ఇచ్చే, వైసిపి, టిడిపిలు రాష్ట్రంలో మాత్రం ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్నాయని విమర్శించారు. బిజెపికి వ్యతిరేకంగా కలిసొచ్చే పార్టీలను, వ్యక్తులను తాము కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. బిజెపి, టిడిపి, జనసేన కలిస్తే రాష్ట్ర ప్రయోజనాలకు తీవ్ర విఘాతం ఏర్పడుతుందన్నారు. బిజెపితో చెలిమి చేసిన ఏ ప్రాంతీయ పార్టీ బతికి బట్టకట్టలేదని అన్నారు. చేగువేరా ఆశయాలు తెలుసుకోకుండా పవన్ కళ్యాణ్, బిజెపితో కలిస్తే ఆయన ఆత్మ ఘోషిస్తుందని ఒక ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ఓటర్ల తొలగింపు సమస్య తీవ్రమైనదని, ఈ విషయాన్ని ఇప్పటికే ఎన్నికల కమిషన్‌కు తెలిపామని అన్నారు. అన్ని పార్టీల సమక్షంలో ఓటర్ల తొలగింపుపై పరిశీలన చేయాలని కోరారు.

నెలాఖరుకు ఉల్లి పిడుగు

- కిలో ధర 60-70 కావచ్చు
- క్రిసిల్ రిపోర్ట్

న్యూఢిల్లీ : ఇప్పటికే రాతెత్తిన టమాటా ధరలతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతుండగా... ఇక ఉల్లి కూడా కొండెక్కి కూచోనుందని రిపోర్ట్‌లు వస్తోన్నాయి. ఆగస్టు నెలాఖరు నాటికి ఉల్లి ధరలు 150 శాతం ఎగిసి కిలో రూ.60-70కి చేరవచ్చని క్రిసిల్ వెల్లడించింది. సరఫరాలో మరిన్ని లోపాలు తలెత్తితో మరింత ధర పెరిగే అవకాశం కూడా ఉందని హెచ్చరించింది. వచ్చే పండగ సీజన్‌లో ఉల్లి ధరలు కూడా ప్రస్తుత టమాటా బాట పట్టనున్నాయని తెలిపింది. క్రిసిల్ రిపోర్ట్ ప్రకారం.. 2023 ఫిబ్రవరి, మార్చిలో అధికంగా అమ్మకాలు నమోదయ్యాయి. గత రబీ సీజన్‌లోని ఉల్లి నిల్వలు సెప్టెంబర్ కంటేముందే.. అంటే ఆగస్టు నాటికే గణనీయంగా పడిపోవచ్చు. దీంతో సెప్టెంబరు



నాటికి సరఫరాలు తగ్గి.. ధరలు పెరగొచ్చు. ప్రస్తుతం ఢిల్లీ మార్కెట్‌లలో ఉల్లిపాయల రిటైల్ ధర కిలోకు సుమారు రూ.30గా ఉంది. తెలుగు రాష్ట్రాల్లో కిలో ఉల్లి ధర రూ.20-25 మధ్య పలుకుతోంది. అక్టోబరు నుంచి ఖరీఫ్ పంట లభ్యత పెరిగితే ఉల్లి ధరలు మళ్లీ తగ్గుముఖం పట్టొచ్చని క్రిసిల్ పేర్కొంది. అక్టోబర్- డిసెంబర్ ధరల్లో కొంత స్థిరత్వం రావొచ్చని అంచనా వేసింది.

మృత్యుపాశమైన కొత్త కారు

- చెట్టును ఢీకొనడంతో నలుగురు దుర్మరణం

ప్రజాశక్తి- తాడిపత్రి రూరల్ (అనంతపురం జిల్లా)

కారుకొన్న ఆనందంలో స్నేహితులకు మద్యం పార్టీ ఇచ్చాడు. అనంతరం అదే కారులో వస్తుండగా జరిగిన ప్రమాదంలో కారు యజమానితోపాటు నలుగురు మృతి చెందారు. మరొకరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. అనంతపురం జిల్లాలో శనివారం తెల్లవారు జామున జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... ఆటో ఫైనాన్స్ నిర్వహిస్తున్న తాడిపత్రి పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన మోహన్‌రెడ్డి (27) సెకండ్ హ్యాండ్ మారుతి స్విఫ్ట్ కారును కొనుగోలు చేశాడు. ఈ నేపథ్యంలో తన స్నేహితులైన నరేష్‌రెడ్డి (28), విష్ణువర్ధన్ చౌదరి (24), మధుసూదనరెడ్డి (28), శ్రీనివాస్‌రెడ్డిలకు అనంతపురం వెళ్లే రోడ్డులో శుక్రవారం రాత్రి మందు పార్టీ ఇచ్చాడు. అనంతరం వారంతా తిరిగి కారులో శనివారం తెల్లవారుజామున రెండు గంటలకు ఇంటికి బయలుదేరారు. రావివెంకటంపల్లి వద్ద తాడిపత్రి-అనంతపురం ప్రధాన రహదారి పక్కన ఉన్న చెట్టును వారి కారు ఢీకొంది. దీంతో, కారులోని నలుగురూ ఒక్కసారిగా ఎగిరి పడ్డారు. ప్రమాద స్థలంలోనే మోహన్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, విష్ణుచౌదరి మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మధుసూదన్‌రెడ్డి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. శ్రీనివాస్‌రెడ్డి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. మద్యం మత్తులో అతివేగంగా కారు నడపడమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు చెప్తున్నారు. మధుసూదన్ రెడ్డికి భార్య రాణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మిగిలిన మృతులంతా అవివాహితులే. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జమ్ముకాశ్మీర్‌లో
ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలి

- తక్షణమే అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలి
- సిపిఎం కేంద్ర కమిటీ డిమాండ్

న్యూఢిల్లీ : రాజ్యాంగంలోని 370వ అధికరణ కింద జమ్ము కాశ్మీర్‌కు గల ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేసి, ఆ రాష్ట్రాన్ని ధ్వంసం చేసి ఆగస్టు 5తో నాలుగేళ్లు గడిచాయి. రాజ్యాంగంపై, సమాఖ్యవాదంపై జరిపిన ఈ దాడి, జమ్ము కాశ్మీర్ ప్రజల హక్కులపై అన్ని రకాల దాడులకు ముందస్తు సంకేతంగా వుందని సిపిఎం కేంద్ర కమిటీ విమర్శించింది. న్యూఢిల్లీలో సమావేశ మైన సిపిఎం కేంద్ర కమిటీ ఈ మేరకు ఒక తీర్మానాన్ని ఆమోదించింది. నివాస చట్టాల్లో, భూ హక్కుల్లో మార్పులు తీసుకురావడం ద్వారా జమ్ము కాశ్మీర్ మూల గుర్తింపును మార్చేందుకు గత ఐదేళ్ల కేంద్ర పాలనలో చర్యలు తీసుకోవడాన్ని చూశాం. రాష్ట్ర జనాభా నిష్పత్తిలో మార్పు తీసుకురావడానికి అదేపని గా యత్నిస్తోంది. ప్రజా భద్రతా చట్టం, యుఎపిఎ వంటి క్రూర చట్టాలను ఉపయోగించి ఈ కాలంలో పెద్ద ఎత్తున రాజకీయ నేతలు, కార్యకర్తలపై నిర్బంధాన్ని ప్రయోగించింది. వందలాదిమంది రాజకీయ ఖైదీలు ఇంకా నిర్బంధంలోనే వున్నారు. వారిలో చాలా మంది జమ్ము కాశ్మీర్ వెలుపల జైళ్లలో వున్నారు.

ఎంతగా గొప్పలు చెప్పినప్పటికీ, అధిక నిరుద్యోగంతో ఆర్థిక పరిస్థితి మరింతగా దిగజారింది. జాతీయ సగటు కన్నా మూడు రెట్లు ఎక్కువగా నిరుద్యోగులు వున్నారు. యాపిల్ రైతులు, చిన్న వ్యాపారస్తులు వంటి వివిధ వర్గాలకు చెందిన ప్రజల జీవనోపాధి దారుణంగా దెబ్బతింది.

మీడియా తీవ్రమైన ప్రభుత్వ అణచివేతను ఎదుర్కొంటోంది. సెన్సార్‌షిప్‌ను విధిస్తూ, భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేస్తూ మార్గదర్శకాలు రుద్దారు. నిరంకుశమైన చట్టాలను ఉపయోగించి అనేక మంది జర్నలిస్టులను అరెస్టు చేశారు.

జమ్ము కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించడంలో విఫలమవడంలోనే ప్రజాస్వామ్యాన్ని, ప్రజల ప్రజాతంత్ర హక్కులను మౌలికంగా తిరస్కరించడమనేది స్పష్టంగా అగుపిస్తోంది. బిజెపి ప్రయోజనాలకు అనుకూలంగా, కాశ్మీర్ లోయలోని ప్రజల ప్రాతినిధ్యాన్ని కుదిస్తూ నియోజకవర్గాల విభజన ప్రక్రియ సాగినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఎన్నికలను నిర్వహించడం లేదు.

అందువల్ల, అన్ని రకాలుగా, జమ్మూ కాశ్మీర్ ప్రజలు రెండవ తరగతి పౌరులుగా కుదించబడ్డారు. అందువల్ల జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీకి తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని సిపిఎం కేంద్ర కమిటీ డిమాండ్ చేస్తోంది.ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడమంటే రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేయాల్సి వుంది. రాజకీయ వ్యతిరేకతను, మీడియాను అణచి వేయడానికై నిరంకుశ చట్టాలను ఉపయోగించడానికి స్వస్తి పలకాలి. జమ్మూ కాశ్మీర్ శాశ్వత నివాసుల నివాస స్థితిని తుడిచిపెట్టే చర్యలన్నింటినీ కేంద్రం వెనక్కి తీసుకోవాలి. వారి భూ హక్కులను కాపాడాలి. తమ హక్కుల పునరుద్ధరణ కోసం పోరు సల్పే జమ్ము కాశ్మీర్ ప్రజలకు, ప్రజాతంత్ర శక్తులకు కేంద్ర కమిటీ సంఘీభావాన్ని తెలియజేస్తోంది.

10న జైలర్, 11న భోళాశంకర్ విడుదల



చిరు భోళాశంకర్ ఈనెల 11న విడుదల కానుంది. అంతకుముందురోజే రజనీకాంత్ జైలర్ సినిమా విడుదలవుతుంది. చిరంజీవి, రజినీకాంత్.. ఇప్పటికీ వరుస సినిమాల్లో నటిస్తూ కెరీర్‌లో బాగా బిజీగా ఉంటున్న విషయం తెలిసిందే. అయితే ఈ ఇద్దరు హీరోలు బాక్సాఫీస్ వద్ద పెద్దగా తలపడిన సందర్భాలు లేవు. కానీ ఈసారి మాత్రం తలపడబోతున్నారు. భోళాశంకర్, జైలర్ సినిమాలు ఒక్క రోజు గ్యాప్‌లో రానున్నాయి. ఖైదీ నంబర్ 150 చిత్రం తర్వాత తమ ఇమేజ్‌కు తగ్గట్టు సరైన విజయాన్ని అందుకోలేకపోయిన చిరు.. ఈ ఏడాది 'వాల్తేరు వీరయ్య'తో ఆ సక్సెస్‌ను చూశారు. చిరు సెకండ్ ఇన్నింగ్స్ కెరీర్‌కు ఇదో మలుపు అనే చెప్పాలి.

సముద్రంలో 'దేవర' యాక్షన్

ఆర్‌ఆర్‌ఆర్ తర్వాత జూనియర్ ఎన్టీఆర్ నటిస్తు న్న భారీ చిత్రం 'దేవర'. కొరటాల శివ దర్శ కత్వంలో తెరకెక్కు తున్న ఈ చిత్రంపై ఫ్యాన్స్ తో పాటు సినీ ప్రియుల్లో భారీ అంచనాలే నెలకొన్నాయి. 'సీతారామం' బ్యూ టీ మృణాల్‌తో 'దేవర' కొత్త షెడ్యూల్ ప్రారంభ మైందంటూ మూవీటీమ్ అఫీషియల్ ఓ సముద్రపు పోస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

చరిత్ర సృష్టించిన అదితి



వ్యక్తిగత కాంపౌండ్ విభాగంలో పసిడి • జ్యోతి సురేఖకు కాంస్యం

ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్‌షిప్



స్వర్ణ పతకానికి మెక్సికో ఆర్చర్‌తో పోటీపడుతున్న అదితి

బెర్లిన్: 17ఏళ్ల అదితి గోపిచంద్ స్వామి చరిత్ర సృష్టించింది. ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్‌షిప్ వ్యక్తిగత విభాగంలో స్వర్ణ పతకం నెగ్గిన తొలి ఆర్చర్‌గా అదితి రికార్డు నెలకొల్పింది. శనివారం జరిగిన వ్యక్తిగత కాంపౌండ్ విభాగం ఫైనల్లో అదితి 149-147 పాయింట్ల తేడాతో మెక్సికోకు చెందిన ఆండ్రియా బెకెర్రాపై సంచలన విజయం సాధించింది. తొలిసారి సీనియర్స్ విభాగం బరిలో దిగిన అదితి.. టోర్నీలో తొలినుంచి అద్భుత ప్రదర్శనతో రాణించింది. సెమీఫైనల్‌లో వెన్నం జ్యోతి సురేఖను ఓడించి ఫైనల్‌కు చేరి స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. అనంతరం మాట్లాడుతూ.. 'తాను పడిన కష్టమంతా నేడు నిజమైందని, ప్రపంచ చాంపియన్‌గా నిలిచేందుకు దోహదపడిందని' పేర్కొంది. ఇటీవల జరిగిన ఖేలో ఇండియా గేమ్స్‌లో రాణించి తొలిసారి ప్రపంచ ఆర్చరీ పోటీలకు ఎంపికైంది. అదితికి స్వర్ణ పతకం దక్కడంతో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ట్విటర్ వేదికగా శుభాకాంక్షలు తెలిపింది. ఈ పోటీల్లో ఆమెకు ఇది రెండో స్వర్ణ పతకం. శుక్రవారం జ్యోతి సురేఖ వెన్నం, పర్నీత్ కౌర్‌తో కలిసి మహిళల జట్టుకు తొలి స్వర్ణ పతకాన్ని అందించింది. ఇక కాంస్య పతక ప్లేఆఫ్‌లో జ్యోతి సురేఖ నెగ్గి పతకాన్ని కైవసం చేసుకుంది. దీంతో ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో భారత్ పతకాల సంఖ్య 13కు చేరింది. ఇందులో రెండు పసిడి, 9 రజిత, మరో రెండు కాంస్య పతకాలు ఉన్నాయి.

ఫైనల్లోకి ప్రణయ్

ఆస్ట్రేలియా ఓపెన్



సిడ్నీ: ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ ఫైనల్లోకి 9వ సీడ్ హెచ్‌ఎస్ ప్రణయ్ దూసుకెళ్లాడు. శనివారం జరిగిన సెమీఫైనల్లో 9వ ర్యాంకర్ ప్రణయ్ 21-18, 21-12 స్కోర్‌తో సహచర ఆటగాడు ప్రియాన్షు రాజవత్‌పై విజయం సాధించాడు. ఈ మ్యాచ్‌ను కేవలం 43 నిమిషాల్లోనే ముగించాడు. దీంతో ప్రణయ్ తొలిసారి సూపర్ 500 టోర్నీలో సెమీస్‌లోకి అడుగుపెట్టాడు. ఆదివారం జరిగే ఫైనల్లో చైనాకు చెందిన వెంగ్ హాంగ్ యంగ్‌తో తలపడనున్నాడు. సెమీస్‌లో వెంగ్- హాంగ్-యంగ్(చైనా) 21-19, 13-21, 21-13తో లీ-జి-జియా(మలేషియా)ను ఓడించాడు. ఇక మహిళల సింగిల్స్ ఫైనల్లోకి 7వ సీడ్ కిమ్-జె-యు(కొరియా), 4వ సీడ్ బివెన్ జంగ్(అమెరికా) ప్రవేశించారు. కిమ్-జె-యంగ్ 21-10, 21-11తో అయా అహోరీ(జపాన్)పై, బివెన్ జంగ్ 21-17, 8-3తో ఆధిక్యతలో ఉన్న దశలో 2వ సీడ్ ఇంటనాన్(మలేషియా) గాయంతో టోర్నీనుంచి నిష్క్రమించింది.

కుర్రాళ్ల సత్తాకు పరీక్ష..

- నేడు వెస్టిండీస్‌తో రెండో టి20
- రాత్రి 8.00గం॥లకు



గయానా: యువ క్రికెటర్లతో కూడిన టీమిండియా వెస్టిండీస్‌తో జరిగిన తొలి టి20లో అనూహ్యంగా ఓటమిపాలైంది. విండీస్ నిర్దేశించిన 150పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో 4 పరుగుల దూరంలో నిలిచి చేజేతులా ఓటమిపాలైంది. డెత్ ఓవర్ల వరకు ఓ నిలకడైన బ్యాటర్ క్రీజ్‌లో ఉంటే ఫలితలం వేరేలా ఉండేది. కానీ నిలకడలేమి కొట్టొచ్చినట్లు కనబడింది. ఇక బౌలర్లకు సహకరించే వెస్టిండీస్ పిచ్‌లపై భారత బౌలర్లు అద్భుతంగా బంతిని విసరగలిగారు. ఈ మ్యాచ్‌లో ఓ ప్రధాన బ్యాటర్ చివరి వరకు క్రీజ్‌లో నిలదొక్కుకుంటే టీమిండియా భారీ స్కోర్ నమోదు చేయడం ఖాయం. వెస్టిండీస్ జట్టు టెస్ట్, వన్డేలతో పోల్చిచూస్తే టి20 ఫార్మాట్‌లో అద్భుతంగా రాణిస్తుంది. ఇక తొలి టి20లో ఎదురైన ఓటమిని పక్కన పెట్టి జాగ్రత్తగా ఆడితే విజయం మనదే!

బుర్రిపాలెంలో నటశేఖరుడి విగ్రహావిష్కరణ

- సందడి చేసిన కృష్ణ అభిమానులు, కళాకారులు

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

సూపర్ స్టార్ కృష్ణ కాంస్య విగ్రహాన్ని ఆయన సొంతూరు గుంటూరు జిల్లా తెనాలి మండలం బుర్రిపాలెంలో గ్రామస్తులు, అభిమానులు నెలకొల్పారు. ఎంతో ఆర్భాటంగా వారు ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని కృష్ణ సోదరుడు ఘట్టమనేని ఆదిశేషగిరిరావు శనివారం ఆవిష్కరించారు. మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, శాసన సభ్యులు శివకుమార్, జనసేన పిఏసి చైర్మన్ నాదెండ్ల మనోహర్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, దర్శకులు ఎస్‌వి కృష్ణారెడ్డి, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, దర్శకులు ఎస్‌వి కృష్ణారెడ్డి, నటులు సుధీర్ కుమార్, కృష్ణ కుమార్తె మంజుల తదితరులు కృష్ణ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జూనియర్ ఆర్టిస్టులు మహేష్‌బాబును అనుకరిస్తూ సందడి చేశారు. అనంతరం ఆదిశేషగిరిరావు మాట్లాడుతూ బుర్రిపాలెం పేరు చెప్పకుండా కృష్ణ మాట్లాడేవారు కాదని, గ్రామం అంటే ఆయనకి అమితాభిమానం అన్నారు. గ్రామ అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారని, ఆయన జ్ఞాపకంగా గ్రామంలో ప్రతి సమస్యను గుర్తించి



విగ్రహావిష్కరణలో ఆదిశేషగిరిరావు, మంత్రి నాగార్జున, ఎమ్మెల్యే

పరిష్కరిస్తామని తెలిపారు. తెలుగు సినిమా రంగంలో కృష్ణ పాత్ర చెరగదని అన్నారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ బుర్రిపాలెం పేరు ప్రపంచ స్థాయి గుర్తింపునకు కృష్ణ కారణమయ్యారని ప్రశంసించారు. నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ హీరో కృష్ణ సినీ రంగంలో ఎదిగిన తీరు, ఆయన రాజకీయ జీవితం కూడా ప్రశంసనీయమన్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఎంత ఎదిగిన ఒదిగి ఉండే స్వభావం నటుడు కృష్ణకే సొంతమని పేరొకన్నారు. నన్నపనని రాజకుమారి మాట్లాడుతూ స్వగ్రామంపై ప్రత్యేకమైన అభిమానాన్ని చాటుకున్న నటులలో కృష్ణ ఒకరని తెలిపారు. దర్శకులు, నిర్మాత ఎస్వీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ కృష్ణతో ఎన్నో చిత్రాలు నిర్మించానని అన్నారు. ఈ సందర్భంగా కృష్ణ జీవిత విశేషాలపై సీనియర్ పాత్రికేయులు వినాయకరావు రచించిన దేవుడు లాంటి మనిషి గ్రంథాన్ని ఆవిష్కరించారు.

క్వార్టర్స్‌కు స్పెయిన్, జపాన్

- ఫిఫా మహిళల ప్రపంచకప్

మెల్‌బోర్న్: ఫిఫా మహిళల ప్రపంచకప్ క్వార్టర్‌ఫైనల్లోకి జపాన్, స్పెయిన్ జట్లు దూసుకెళ్లాయి. శనివారం జరిగిన తొలి ప్రి క్వార్టర్‌ఫైనల్లో స్పెయిన్ జట్టు 5-1గోల్స్ తేడాతో స్విట్జర్లాండ్‌ను, జపాన్ జట్టు 3-1గోల్స్ తేడాతో నార్వేజట్టును చిత్తుచేశాయి. స్పెయిన్ తరఫున బొన్మాటి 5, 36వ ని.లో రెడు గోల్స్ కొట్టగా.. అల్బా రెడోంజే(17వ ని.), లైయా కొడెనా(45వ ని.), జెన్నిఫర్(70వ ని.)లో ఒక్కో గోల్ చేశారు. స్పెయిన్ రక్షణ శ్రేసి స్విట్జర్లాండ్ ప్లేయర్స్‌ను అద్భుతంగా అడ్డుకుంది. స్విట్జర్లాండ్ తరఫున ఏకైక గోల్‌ను లైయా కొడినా(11వ ని.)లో చేసింది. ఇక జపాన్ తరఫున ఇంగ్రిడ్(15వ ని.)లో ఓన్ గోల్ చేయగా.. రేసా షమిజ(50వ ని.), హినటా(81వ ని.)లో ఒక్కో గోల్ కొట్టారు. నార్వే తరఫున ఏకైక గోల్‌ను గురో(20వ ని.)లో చేశారు.

ఫిఫా మహిళల ప్రపంచకప్‌లో నేడు..

నెదర్లాండ్స్ × దక్షిణాఫ్రికా(ఉ. 7.30గం॥లకు)

స్వీడన్ × అమెరికా(మ.2.30గం॥లకు)

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68